




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 129 | బుధవారం 15 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi





## వైద్య కళాశాలల నిర్మాణానికి

# రూ.500కోట్లు!

- తక్షణమే నిధులు విడుదల చేస్తాం
- ఇకనుంచి ప్రతి నెలా రూ.340 కోట్లు
- వైద్యశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- నేడు హనుమకొండకు ముఖ్యమంత్రి

**హైదరాబాద్‌- సూర్య వాస్తవం, అక్టోబరు 14:** రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల నిర్మా ణం కోసం తక్షణమే రూ.500 కోట్లు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఒకట్రెండు రోజుల్లోనే నిధులు విడుదలవుతాయన్నారు. వైద్య కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణం తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహలు మంగళవారం ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. బిల్లుల పెండింగ్ కారణంగా వైద్య కళాశాలల

- మిగతా 2లో..



# ఆవిష్కరణలు, అవకాశాలకు

# కొత్త శకం

- గూగుల్ రాక డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా సరికొత్త
- అధ్యాయం.. ఏఐని ప్రతి ఇంటికీ చేరువ చేస్తాం
- అప్పుడు మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్ తీసుకొచ్చా
- ఇప్పుడు గూగుల్ విశాఖ వస్తుండడం గర్వకారణం
- ప్రాజెక్టు కోసం లోకేశ్ ఎంతో కష్టపడ్డాడు: సీఎం
- ప్రధాని టెక్నాలజీని వేగంగా స్వీకరిస్తారు
- విశాఖలో గూగుల్ డేటా సెంటర్ గురించి చెప్పగానే ఫిబ్రవరిలో గ్లోబల్ ఏఐ సదస్సుపై ఆలోచన చేశారు
- మోదీ, కేంద్ర మంత్రులు నిర్మల, వైష్ణవ్‌కు కృతజ్ఞతలు
- గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా వైజాగ్: గూగుల్ క్లౌడ్ సీఈవో
- దేశ ప్రగతిలో ఏపీ కీలక భూమిక: వైష్ణవ్

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం అక్టోబరు 14:** గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావడం.. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చరిత్రాత్మక ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆవిష్కరణలు, అవకాశాలకు కొత్త శకంగా అభివర్ణించారు. విశాఖలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు కోసం గూగుల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందంపై మంగళవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్ ప్రసంగించారు.

వచ్చే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని గూగుల్ నిర్ణయించడం సంతోషమని సీఎం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ పెట్టుబడి భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో సరికొత్త అధ్యాయంగా పేర్కొన్నారు. దేశంలో మొదటి గిగావాట్-స్కేల్ డేటా సెంటర్ విశాఖకు రావడం ఏపీకి గర్వకారణమన్నారు. 'రియల్ టైమ్ డేటా, హిస్టారికల్ డేటాల సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని భారత్ వేగంగా అందిపుచ్చుకుంటోంది. ఏపీలో కృత్రిమ మేధ (ఏఐ)ను ప్రతి కుటుంబానికీ చేరువ చేసేందుకు ప్రయత్నిస్తాం. 1990ల చివర్లో మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్ తీసుకొచ్చాను. ఈ రోజు గూగుల్ విశాఖ

- మిగతా 2లో..

# పర్వతారోహణలో కర్నూలు యువకుడి రికార్డు

- ప్రపంచంలోని టాప్-9 శిఖరాల అధిరోహణ
- దేశంలోనే తొలి వ్యక్తిగా ఘనత



- మిగతా 2లో..

## పవన్ కల్యాణ్ చొరవ..

# అపరిష్కృత సమస్య పరిష్కారం



**అమరావతి-సూర్య వాస్తవం, అక్టోబరు14:** కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. సెజ్ పరిధిలోని 2,180 ఎకరాల భూములకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీలను మినహాయించి తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసేలా నిర్ణయం తీసుకుంది కూటమి ప్రభుత్వం. పవన్ కల్యాణ్ చొరవ తీసుకొని ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించారు. దీంతో కాకినాడ తీరంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల పరిధిలో సుమారు 1,551 మంది రైతులకు మేలు జరుగనుంది. అయితే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఈ విషయంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చర్చించారు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ రుసుములు, స్టాంప్ డ్యూటీ మినహాయింపునిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు సీఎం చంద్రబాబు.

- మిగతా 2లో..

# రాజస్తాన్‌లో ఘోరం

- బస్సులో మంటలు చెలరేగి 19 మంది సజీవదహనం



- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# మల్లోజుల వేణుగోపాల్‌రావు లొంగుబాటు

- గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత
- ఆయనతోపాటు మరో 60
- మంది.. 54 ఆయుధాల అప్పగింత
- నక్సలైటు ఉద్యమంలో మల్లోజులది 45 ఏళ్ల ప్రస్థానం
- పార్టీ సిద్ధాంతకర్తగా, బాహ్యప్రపంచంతో అనుసంధానకర్తగా పేరు ఆపరేషన్ కగార్ నేపథ్యంలో భిన్న వైఖరి

**పెద్దపల్లి-సూర్య వాస్తవం, అక్టోబరు 14:** గత కొన్ని రోజులుగా వామపక్షవాదులు, ప్రజాసంఘాల శ్రేణులు ఊహిస్తున్నట్లుగానే.. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు పోలీసులకు లొంగిపోయారు. నాలుగున్నర దశాబ్దాల ఉద్యమ, అజ్ఞాత జీవితం వీడి మంగళవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట 60 మంది మావోయిస్టులతో కలిసి ఆయన లొంగిపోయారు. వీరిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన ముగ్గురు సభ్యులు, పలు డివిజనల్ కమిటీలకు చెందిన పది మంది సభ్యులు కూడా ఉన్నారు. మొత్తం 54 ఆయుధాలతో సహా వీరు లొంగిపోయారని, ఆ ఆయుధాల్లో ఏడు ఏకే 47లు, తొమ్మిది ఇన్సాస్ రైఫిళ్లు ఉన్నాయని ఒక పోలీసు అధికారి వెల్లడించారు. సోమవారం రాత్రి 10 గంటల

- మిగతా 2లో..



# వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.500కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొన్న సంగతి తెలిసిందే. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇకపై ప్రతినెలా వైద్య, నర్సింగ్ ఆస్పత్రుల నిర్మాణం కోసం రూ.340 కోట్లు క్రమం తప్పకుండా విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. కాగా, వైద్య ఆరోగ్యశాఖలో కేంద్రం నుంచి వచ్చే నిధులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా పీఎం అభిమ్, జాతీయ ఆరోగ్య మిషన్, 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి అందాల్సిన నిధులను వెంటనే రాబట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కేంద్రం ఇచ్చే 60% నిధులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున 40% నిధులను జమ చేస్తే, వెంటనే వస్తాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలు, నర్సింగ్, టిమ్స్ ఆస్పత్రులు, నిమ్స్ ఆస్పత్రి విస్తరణ, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్ప త్రి నిర్మాణ పురోగతిపై సీఎం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టులకు ఇప్పటివరకు ఎంత ఖర్చు పెట్టారు? ఇంకెంత వెచ్చించాలి? అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. వైద్య, నర్సింగ్ కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణం నిలిచిపోకూడదని సీఎం ఆదేశించినట్లు తెలిసింది.

**సీఎంతో రేవంత్‌తో మీనాక్షి భేటీ**

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)ల నియామక ప్రక్రియ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, ప్రచారం తదితర అంశాలపై ఇరువురూ చర్చించారు. కాగా, సీఎం రేవంత్ బుధవారం హనుమకొండ వెళ్లనున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి స్మారక కార్యక్రమంలో పాల్గొని, నివాళులు అర్పించనున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

# పర్వతారోహణలో కర్నూలు యువకుడి రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన 36 ఏళ్ల పర్వతారోహకుడు తమ్మినేని భరత్ అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో ఒకటైన చైనాలోని మౌంట్ చో ఒయు పర్వతాన్ని (8,188 మీటర్లు) అధిరోహించారు. కాగా ఇప్పటికే ఆయన 8 అత్యంత ఎత్తైన పర్వతాలను విజయవంతంగా అధిరోహిం చారు. తాజాగా మౌంట్ చో ఒయు పర్వతాన్ని ఎక్కి.. ప్రపంచంలోని ఎత్తైన శిఖరాలలో తొమ్మిదింటిని అధిరోహించిన మొదటి భారతీయునిగా నిలిచారు. భరత్ 2017 మే లో మౌంట్ ఎవరెస్ట్.. సెప్టెంబర్ 2018లో మౌంట్ మనస్లు, మే 2019లో మౌంట్ లోట్సే, మార్చి 2022లో అన్నపూర్ణ, ఏప్రిల్ 2022లో కాంచన్‌జంగా, మే 2023లో మకాలు, అక్టోబర్ 2024లో శిశాపాంగ్మా, ఏప్రిల్ 2025లో మౌంట్ ధౌలగిరి%%.తదితర 8,000 మీటర్లకు పైగా ఎత్తైన శిఖరాలను అధిరోహించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

మౌంట్‌చో ఒయు పర్వతాన్ని అధిరోహించడానికి భరత్ సెప్టెంబర్ 30న చైనాలోని చో ఒయు బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. అయితే ఆ సమయంలో అక్కడి ప్రతికూల వాతావరణం, భారీ హిమపాతం కారణంగా పర్వతాన్ని ఎక్కే ప్రయత్నాలు విరమించుకోవాల్సి వచ్చింది. దీంతో నాటి నుంచి అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం 6.55 గంటలకు ట్రెక్కింగ్ ప్రారంభించి, 8.55 గంటలకు పర్వత శిఖరాన్ని చేరుకున్నట్లు తెలిపారు. దీంతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో తొమ్మిదింటిని విజయవంతంగా అధిరోహించి..రికార్డు నెలకొల్పారు. ఇక మిగిలిన 5 పర్వతాలు పాకిస్థాన్‌లో ఉన్నందున ప్రస్తుతానికి వాటిని అధిరోహించేందుకు వీలు కుదరడం లేదని, సమీప భవిష్యత్తులోనే ఆ శిఖరాలను కూడా అధిరోహిస్తానని భరత్ తెలిపారు.

# రాజస్తాన్‌లో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)



**జైపూర్-సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** రాజస్తాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సులో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 19మంది సజీవదహనం కాగా.. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 57 మంది ప్రయాణీకులు ఉన్నారు. జైసల్మేర్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ప్రైవేటు బస్సు జోధ్‌పూర్‌కు బయలుదేరింది. జైసల్మేర్‌లో బయలుదేరిన కొద్ది సేపటికే, అంటే దాదాపు 20 కిలోమీటర్లు దూరంలోని థాయత్ గ్రామ సమీపానికి చేరుకోగానే బస్సు వెనక భాగంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు.. క్షణాల్లోనే బస్సంతా వ్యాపించాయి. దీంతో బస్సును నిలిపి వేసిన డ్రైవర్.. ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. మరోవైపు వెంటనే స్పందించిన స్థానికులు, ఇతర వాహనదారులు ఫైర్ సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు బస్సులో మంటలను అర్పివేశాయి. అయినా బస్సు 80 శాతం వరకూ కాలిపోయింది. అధిక ఉష్ణోగ్రతలు కారణంగా సహాయక చర్యలకు ఆలస్యమయింది. సాయంత్రం వరకూ మృతదేహాలు బస్సులో ఉన్నాయి. క్షతగాత్రులను జైసల్మేర్‌లోని జవహర్ ఆసుపత్రికి తరలించారు. తరువాత వారిని జోధ్‌పూర్‌కు రిఫర్ చేశారు. గాయలైన వారి పరిస్థితి విషమంగా ఉందని, శరీరంలో 70 శాతం గాయాలయ్యాయని సమాచారం. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రాధమిక విచారణ ప్రకారం షార్ట్ సర్క్యూట్ వలనే ఈ ప్రమాదం జరిగిందని అంచనా వేస్తున్నారు. ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నట్లు జోధ్‌పూర్ ఐజీ రాజేశ్ మీనా తెలిపారు.ఈ ఘటనపై రాజస్తాన్ గవర్నర్ హరిభౌ బగడే, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ స్పందించారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# ఆవిష్కరణలు, అవకాశాలకు కొత్త శకం

(మొదటి పేజీ తరువాయి)

వస్తుండడం నాకు గర్వకారణం' అని తెలిపారు. హైటెక్ సిటీ నుంచి 2025లో ఏఐ డేటా సెంటర్ వరకు స్ఫూర్తిదాయకమైన పరివర్తనను చూస్తున్నామన్నారు. విశాఖకు గూగుల్ రావడంలో లోకేశ్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. 'ఆయన గూగుల్‌తో కలిసి చాలా సన్నిహితంగా పనిచేశాడు.. వారి కార్యాలయాన్ని సందర్శించాడు.. చాలా సమయం కేటాయించాడు.. క్రమం తప్పకుండా నాకు సమాచారం అందించాడు. ఈ ప్రాజెక్టును 12 నెలల్లో తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. 13 నెలలు పట్టినప్పటికీ.. మొత్తానికి సాధించగలిగాం. ఈ విజయం పట్ల గర్వపడుతున్నాను' అని తెలిపారు. గూగుల్ ప్రాజెక్టుకు సహకరించిన ప్రధానికి, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

**ప్రగతిశీల విధానాల వల్లే: నిర్మల**

గూగుల్ డేటా ప్రాజెక్టు అత్యంత వేగంగా అమల్లోకి రావడం దేశ ప్రగతిలో అత్యంత కీలకమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. దార్శనిక నేతలు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆలోచనలు, ప్రగతిశీల విధానాలు, నిర్ణయాల్లో వైవిధ్యం వల్లే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు సాకారమైందని తెలిపారు. కేంద్రంలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ తరహా సుపరిపాలన ఉందని చెప్పారు. టెక్నాలజీకి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చే ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు దేశ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నాయని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. దేశంలో డేటా సెంటర్ పాలసీ ద్వారా ఈ తరహా డేటా సెంటర్లు ఏర్పాటవుతున్నాయని అన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి వివిధ రాష్ట్రాలు పోటీ పడుతున్నాయని, 2047-వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇలాంటి పోటీ అవసరమని చెప్పారు.

**దేశాల అనుసంధానానికి విశాఖ హబ్ వేదిక: కురియన్**

ఏఐ డేటా హబ్ ఏర్పాటుతో గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా విశాఖపట్నం మారుతుందని గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ అన్నారు. ఈ డేటా సెంటర్ ద్వారా వివిధ సంస్థలకు సరైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. భారత్‌తో పాటు వివిధ దేశాలను అనుసంధానించేందుకు విశాఖలోని డేటా హబ్ వేదిక అవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, గూగుల్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలీ, టీడీపీ ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్, జీఎం హరీశ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**ట్రెండింగ్‌లో 'గూగుల్ కమ్స్ టు ఏపీ'**

'గూగుల్ కమ్స్ టు ఏపీ' హ్యాష్‌ట్యాగ్ దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లో నిలిచింది. ఢిల్లీలో మంగళవారం గూగుల్‌తో ఏపీ ప్రభుత్వ ఒప్పందం కార్యక్రమం జాతీయ మీడియాలో ప్రముఖంగా ప్రసారం కావడంతో 'ఎక్స్'లో మొదటి స్థానంలో ట్రెండ్ అయింది. ఈ ఒప్పందంపై సీఎం చంద్రబాబు 'ఓకే గూగుల్.. సింక్రనైజ్ ఫర్ వికసిత్ భారత్' అని పోస్టు చేశారు. ఈ పోస్టును అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్, లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్, గూగుల్ నెట్‌వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలీకి ట్యాగ్ చేశారు.

## డేటా ఇంధనమైతే.. డేటా సెంటర్ రిఫైనరీ

- విశాఖ ఏఐ హబ్‌తో గ్రామాల్లో విస్తృత సేవలు
- ఈ మజిలీలో కనిపించని హీరోలెందరో!
- సాంకేతిక మార్పులకు అనుగుణంగా యువత నైపుణ్యం పెంచుకోవాలి
- మనవాళ్లను కొత్త అవకాశాలకు సిద్ధం చేయాలి
- ఇందుకు గూగుల్ మార్గనిర్దేశం కోరుతున్నా: లోకేశ్

విశాఖలో ఏఐ హబ్ ఏర్పాటు ఆంధ్రప్రదేశ్, గూగుల్‌కే కాదు.. యావద్దేశానికే చరిత్రాత్మకమైందని లోకేశ్ అన్నారు. 'గూగుల్ డేటా సెంటర్ గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, విస్తృతమైన సేవలను అందించబోతోంది. ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ముందుండి నడిపించడం గర్వకారణంగా భావిస్తున్నాం. ఏఐ హబ్ కేవలం భారత్, ఏపీకే గాక ప్రపంచ వేదికపై మన దేశం కీలకపాత్ర పోషించేలా చేస్తుంది. అందుకే కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఈ ప్రాజెక్టు కోసం సమష్టిగా కలసి పనిచేశాయి. 'డేటా ఇంధనం అయితే.. డేటా సెంటర్లు రిఫైనరీల లాంటివి. 12 నెలల్లో పూర్తవుతుందనుకున్న ఏఐ హబ్ ఎంవోయూ ఒక నెల ఆలస్యమైంది. ఇదో ఉత్సాహభరితమైన ప్రయాణం. ఈ మజిలీలో ఎందరో కనిపించని హీరోలు ఉన్నారు. అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన యువత నైపుణ్యం పెంచుకోవాలి. ఏఐని స్వీకరించాలి. పాఠ్యాంశాలను పునర్వ్యవస్థీకరించాలి. మన యువతను కొత్త అవకాశాలకు సిద్ధం చేయాలి. గతంలో వై2కే విప్లవం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల రూపురేఖలు మార్చింది. ఇప్పుడు ఏఐతో కొత్తతరం పట్టణాలు అభివృద్ధి చెందబోతున్నాయి. సీఎం.. విద్య, ఐటీని ఒకే గొడుగు కిందకు తెచ్చి, ఆ బాధ్యతలను నాకు అప్పగించారు. ఈ రెండు రంగాల్లో క్షేత్ర స్థాయి అత్యుత్తమ ఫలితాలను తేవడమే నా లక్ష్యం' అని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా అమలు చేస్తుందని.. అటువంటి నిర్ణయం భారత్‌కు, ప్రపంచానికి కూడా ఒక నమూనాగా మారుతుందని తెలిపారు. 'మా లక్ష్యాలను అధిగమించేందుకు గూగుల్ మార్గదర్శకత్వం వహించి సహకరించాల్సిందిగా కోరుతున్నాను. విశాఖ ఏఐ హబ్ మన యువతను తర్వాతితరం సాంకేతిక విప్లవానికి సిద్ధం చేస్తుంది' అని తెలిపారు.

# మల్లోజుల వేణుగోపాల్‌రావు లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో మావోయిస్టులు వారంతటవారే లొంగిపోయేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. మహారాష్ట్రలోని హెూడ్రి అనే గ్రామం వద్ద నుంచి వారిని పోలీసు వాహనాల్లో గడ్చిరోలి పోలీసు ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చామని వెల్లడించారు. అక్కడ ఆయుధాలను అప్పగించి వారు లొంగిపోయారన్నారు. కాగా, మల్లోజుల వేణుగోపాల్‌రావు మీద రూ.6 కోట్ల రివార్డు ఉంది. వందకు పైగా కేసులు నమోదై ఉన్నాయి.

అత్యంత కీలక నేతల్లో ఒకరు

70 ఏళ్ల వయసున్న వేణుగోపాల్‌రావు అలియాస్ భూపతి, సోనును మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన నేతల్లో ఒకరిగా భావిస్తారు. ఆ పార్టీ సిద్ధాంతకర్తగా ఆయనకు పేరుంది. ఛత్తీసగఢ్ అడవుల్లోని పార్టీకి బాహ్యప్రపంచానికి మధ్య ఆయన అనుసంధానకర్తగా కూడా వ్యవహరించినట్లు సమాచారం. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో ఈ ఏడాది మే నెలలో మావోయిస్టు పార్టీ

**లొంగుబాట్ల వెనుక పోలీసు నిఘా వర్గాల సుదీర్ఘ కసరత్తు**

ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరణించిన తర్వాత.. పార్టీకి తదుపరి సారథ్యం వహించే నేతల్లో వేణుగోపాల్‌రావు పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. అయితే, ఆ బాధ్యతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి అప్పగించారని, పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయన నియమితులయ్యారని వార్తలు వెలువడ్డాయి. మరోవైపు, కగార్‌లో భాగంగా వరుసగా ఎన్‌కౌంటర్లు జరగటం, మావోయిస్టు పార్టీ అత్యంత సీనియర్ నేతలను, సెంట్రల్ కమిటీ సభ్యులను కోల్పోవటం జరుగుతూ వచ్చింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టు ఉద్యమాన్ని తుదముట్టిస్తామని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా చెబుతున్నట్లుగానే ఈ పరిణామాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, మావోయిస్టు పార్టీలో అంతరంగిక చర్చ ప్రారంభమైనట్లు సమాచారం. ఆయుధాలు విడిచిపెట్టి జనజీవనస్రవంతిలో కలిసి, ప్రజా సమస్యలపై బహిరంగ ఉద్యమాలు నిర్మించాలని తద్వారా మావోయిస్టు పార్టీని రక్షించుకుందామని వేణుగోపాల్ ప్రతిపాదించగా.. దానిని ఇతర నేతలు వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వేణుగోపాల్ నుంచి అనూహ్యంగా విడుదలైన ఒక బహిరంగలేఖ పెను సంచలనం సృష్టించింది. సాయుధపోరును తాత్కాలికంగా వదిలిపెట్టి శాంతిమార్గంలోకి వస్తామని, ప్రభుత్వంతో చర్చలు జరపటానికి సిద్ధమంటూ ఆయన మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ హెూదాలో, తన ఫొటో ముద్రించి ఉన్న లేఖను విడుదల చేశారు. ఈ లేఖకు ప్రతిగా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్.. సాయుధ పోరాటాన్ని వీడేది లేదంటూ ఓ లేఖ విడుదల చేశారు. ఆ తర్వాత కూడా వేణుగోపాల్ తన ప్రతిపాదనను సమర్థిస్తూ మరో లేఖ విడుదల చేశారు. దీంతో ఆయన లొంగిపోవడం ఖాయమని అంతా భావించారు. వారం రోజుల క్రితమే ఆయన హైదరాబాద్ పోలీసులకు లొంగిపోయారనే వార్తలు కూడా వెలువడ్డాయి. తాజాగా, ఆయన మహారాష్ట్రలో పోలీసుల ఎదుట లొంగిపోయినప్పటికీ, అందుకు సంబంధించిన ఫొటోలను మాత్రం ప్రభుత్వం విడుదల చేయలేదు. కాగా, వేణుగోపాల్‌రావుకు మావోయిస్టు పార్టీలో కొన్ని కమిటీలు మద్దతు తెలపటం, భారీ సంఖ్యలో లొంగిపోవటం వంటి పరిణామాలు కూడా చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా, వేణుగోపాల్‌రావు ప్రోద్బలంతోనే తెలంగాణలోని భద్రాది-కొత్తగూడెం, ములుగు ప్రాంతాల్లో పలువురు మావోయిస్టులు లొంగిపోయినట్లుగా పోలీసు వర్గాలు తెలిపాయి.

**ఆనందంగా ఉంది**

తమ బాబాయి అడవులను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని మల్లోజుల వేణుగోపాల్‌రావు పెద్దన్న ఆంజనేయులు కుమారుడు దిలీపశర్మ తెలిపారు. ఆయన ఎలా ఉంటారో ఇప్పటి వరకు చూడలేదని తెలిపారు. ఉద్యమంలోకి వెళ్లిపోయిన కొడుకులను ఒక్కసారైనా చూడాలన్న కోరిక నెరవేరకుండానే నానమ్మ మధురమ్మ మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల పునరావాసానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని దిలీప్ శర్మ పేర్కొన్నారు.

**ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81, 141 బెటాలియన్ అధికారులు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతతో మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట ఆరుగురు మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో బీజాపూర్ జిల్లాకు చెందిన మిలీషియా కమాండర్ పద్దం లక్మా, సీఎన్ఎం కమాండర్ దొడ్డి బుద్రు, పార్టీ సభ్యులు లేఖం బండి, మడవి కోసా, మిలీషియా మెంబర్ మడవి లక్మా, సుక్మా జిల్లాకు చెందిన పార్టీ సభ్యుడు కుంజం పాపారావు ఉన్నారు.

**కోటన్న స్ఫూర్తిగా అడవి బాట**

పెద్దపల్లి పట్టణానికి చెందిన మధురమ్మ, వెంకటయ్య దంపతులకు మల్లోజుల మూడో సంతానం. ఆయన రెండో అన్న మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ 1975లో సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అంచలంచెలుగా ఎదిగారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పని చేశారు. 2011 నవంబరు 11న పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కిషన్‌జీ మరణించారు. సోదరుడు కిషన్‌జీ స్ఫూర్తితోనే వేణుగోపాల్‌రావు సైతం 1980 ప్రాంతంలో నక్సల్ ఉద్యమంలోకి అడుగుపెట్టారు. 2010 ఏప్రిల్‌లో దంతేవాడలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతికి కారణమైన ఘటనలో వేణుగోపాల్ కీలకపాత్ర పోషించారని చెబుతారు. అదే ఏడాది కేంద్ర కమిటీ సభ్యుడు చెరుకూరి రాజ్‌కుమార్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన అనంతరం కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగా నియమితుడయ్యారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా వేణుగోపాల్ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. అభయ్ పేరిట లేఖలు విడుదల చేసేవారు. ఉద్యమంలో వేణుగోపాల్‌కు సహచరిగా ఉన్న గడ్చిరోలి జిల్లాకు చెందిన సిడాం విమలచంద్ర అలియాస్ తారక అలియాస్ వత్సల ఈ ఏడాది జనవరి 1న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఎదుట లొంగిపోయారు.

# మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పండి

**అమరావతి-సూర్య వాస్తవం,** అక్టోబరు 14: 'ఆడవాళ్లంతా తాగుబోతులు' అంటూ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్రంగా ఖండించారు. బ్రహ్మానాయుడి వ్యాఖ్యలపై మీడియాలో దుమారం రేగడంతో ఆమె స్పందించారు. మహిళలను అవమానపరుస్తూ చేసిన ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మచ్చగా అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలను బట్టి ఆయనకు మహిళల పట్ల ఉన్న చులకనభావం అర్థమవుతోందన్నారు. మహిళలను అగౌరవపరిచినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందని, అలా చేయకుంటే కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల మాటలు ఆదర్శవంతంగా ఉండాలిగానీ ప్రజలు అసహ్యించుకునేలా ఉండకూడదని సూచించారు. సంస్కారవంతులెవరూ బ్రహ్మానాయుడిలా మాట్లాడరని, మహిళలను అవమానించే నాయకులు ప్రజా సేవకు అనర్హులని తేల్చిచెప్పారు. మహిళలపై ఎవరైనా వ్యాఖ్యలు చేసేముందు వారింట్లో తల్లి, చెల్లి, భార్య, నిత్యం పూజించే దేవత కూడా మహిళే అని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ప్రతి వ్యాఖ్యనూ కమిషన్ తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టంచేశారు. మహిళల్ని తూలనాడే రాజకీయనేతలపై నిఘా పెట్టి ప్రభుత్వ పెద్దలు సైతం ఇలాంటి విష



సంస్కృతిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## సంపాదకీయం

# పాకిస్తాన్ 4 ముక్కలేనా...

అఫ్ఘానిస్థాన్ హెచ్చరికలు, గాజా వివాదం, బలూచిస్థాన్‌లో తిరుగుబాటు, ఆర్థికంగా కుదేలు కావడం వంటి వాటితో ప్రస్తుతం పాకిస్థాన్ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. నలువైపులా సవాళ్లతో సతమతమవుతున్న పాక్ భవిష్యత్తుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అఫ్ఘానిస్థాన్ నుంచి వస్తున్న హెచ్చరికలు ఒక వైపు, మరోవైపు గాజా ఒప్పందానికి మద్దతు పలకడంపై సొంత దేశంలోనే తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలు పాక్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పాక్‌లో వేర్పాటువాద ఉద్యమాలు పెరుగుతున్నాయా? అన్న సందేహాలు వస్తున్నాయి. ఈ పరిస్థితులకు తోడు, "పక్కలో బల్లెం"లా మారిన బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ రోజుకో దాడితో పాకిస్థాన్‌ను చావుదెబ్బ కొడుతోంది. బలూచిస్థాన్‌లో నిరంతరం కొనసాగుతున్న ఈ తిరుగుబాటు దేశ భద్రతకు పెను సవాలుగా మారింది. అంతేకాకుండా, పాకిస్థాన్ సొంత గడ్డపైనే అనేక ప్రాంతాలలో వేర్పాటువాద ఉద్యమాలు ఇబ్బడిముబ్బడిగా నడుస్తున్నాయి. కిస్తాన్ లోని పలు కీలక నగరాల్లో ప్రస్తుతం తీవ్ర హింస చెలరేగుతోంది. గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ౖఒఖ సంస్థ చేపట్టిన భారీ ర్యాలీ హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతూ పోలీసుల పైకి రాళ్లు రువ్వారు. లాహోర్, ఇస్లామాబాద్, పెషావర్, క్వెట్టాతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా, ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీని ముట్టడించేందుకు నిరసనకారులు ప్రయత్నించగా, పోలీసులు వారిని సమర్థవంతంగా అడ్డుకున్నారు. లాహోర్ నగరంలో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. అఫ్గానిస్తాన్ తూర్పు కునార్ ప్రావిన్స్‌లోని డ్యూరాండ్ లైన్ వెంబడి, పక్టియా, దక్షిణ హెల్మండ్ వెంబడి ఉన్న పాకిస్తాన్ సైనిక పోస్టులపై దాడులు జరిగాయని తాలిబాన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిందితాలిబాన్ దళాలు తేలిక నుంచి భారీ ఆయుధాలతో దాడి చేశాయని, ఇది ఇరుపక్షాల మధ్య తీవ్రమైన పోరాటానికి దారితీసిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. అఫ్గానిస్తాన్ నుంచి జరిగిన దాడులను పాకిస్తాన్ సైనిక వర్గాలు కూడా ధృవీకరించాయి. బలూచిస్థాన్ లోని అంగూర్ అడ్డా, బజౌర్, కుర్రం, దిర్, చిత్రల్, బారామ్ చాహ్ వంటి ప్రదేశాలపై ఎలాంటి కవ్వింపులు లేకపోయినా తాలిబాన్ దళాలు కాల్పులు జరిపాయని తెలిపాయి. సరిహద్దుకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకిస్తాన్ లోని కుర్రం జిల్లాకు చెందిన ఒక పోలీసు అధికారి మాట్లాడుతూ, ఇరువైపులా భారీ ఆయుధాలతో కాల్పులు జరుగుతున్నాయని, ఇప్పటిదాకా ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని చెప్పారు. పాక్‌కు బలూచ్ ఆర్మీ మరింత తలనొప్పులు తెస్తోంది. పాకిస్తాన్ చేతుల్లో నుంచి బలూచిస్తాన్ జారిపోతోంది. ఃఒం వరుస దాడులతో పాక్ ఆర్మీ బెంబేలెత్తిపోతోంది. గత కొన్ని రోజులుగా బలూచిస్తాన్‌లో నాన్‌స్టాప్ వార్ జరుగుతోంది. పాక్ సైన్యాన్ని బలూచ్ లిబరేషన్ ఆర్మీ తరుముతోంది. బలూచిస్తాన్‌లో పలు చోట్ల పాక్ ఆర్మీపై ఃఒం దాడులు చేస్తోంది. పాక్ పోలీస్ స్టేషన్లను స్వాధీనం చేసుకుని, హైవేలను నిర్బంధించింది. పాకిస్తాన్ పోలీసులను ఖైదు చేసింది. పాక్ ఆర్మీ ఇన్‌ఫార్మర్లను ఃఒం ఫైటర్లు అదుపులోకి తీసుకుంటున్నారు. పాక్ బలగాలపై ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నారు. బాంబులతో పాక్ ఆర్మీ వాహనాలను పేల్చివేస్తున్నారు. కోటిన్నర జనాభా ఉన్న బెలూచిస్తాన్.. పాకిస్తాన్‌లోని అతిపెద్ద ప్రాంతం. బొగ్గు. బంగారం లాంటి ఖరీదైన ఖనిజ నిక్షేపాలతో పాటు సహజవాయు నిల్వలు అపారంగా ఉన్నా.. తమకు ప్రయోజనాలు దక్కడం లేదనేది స్థానికుల వాదన. పైగా.. పాకిస్తాన్ ప్రభుత్వం తమపై రాజకీయంగా కక్ష తీర్చుకుంటోందన్న ఆవేదన. వీళ్ల కడుపుమంట నుంచి పుట్టిందే బలూచ్ లిబరేషన్ ఆర్మీ.. బీఎల్ఏ. పాకిస్తాన్ నుంచి విడదీసి బలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో పాతికేళ్ల కింద ఏర్పాటైన వేర్పాటువాద సంస్థ. పాకిస్తాన్-ఇరాన్ మధ్య విభజించిన ఇరానియన్ జాతి సమూహం. బలూచ్-నివాస ప్రావిన్సులు కేంద్ర ప్రభుత్వాలకు నిరంతరం ఇబ్బందులకు కారణమవుతున్నాయి. సాయుధ స్వాతంత్ర్య ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. పుట్టింది ఆఫ్ఘన్ నగరం కాందహార్‌లో.. నలుగురితో మొదలై ఇప్పుడు 600 మంది సాయుధులతో మిలిటెంట్ ఆర్గనైజేషన్‌గా ఎదిగింది. మొదట్లో ఆఫ్ఘన్ నుంచే ఎటాకింగ్ షురూచేసేది. తర్వాత పాకిస్తాన్ లోపలికి జొరబడి బెలూచ్ నడిగడ్డ మీద నుంచే సవాల్ విసురుతోంది. ఇప్పుడు పాకిస్తాన్ మిలిటరీకి సమఉజ్జీగా మారి.. ఆ దేశ పాలకుల కంట్లో నలుసుగా మారింది. పాకిస్తాన్ ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యల్లో అత్యంత కీలకమైంది బెలూచ్ తిరుగుబాటు బెడద. "పాకిస్తాన్ ఒక వికృతమైన భావజాలమున్న న్యూక్లియర్ కంట్రీ.. ఐసిస్ లాంటి గ్లోబల్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌కు పాలు పోసి పెంచుతోంది.. ఈ మొత్తం ప్రోగ్రామ్ ఐఎస్ఐ కనుసన్నల్లోనే డిజైనౌతోంది.. మేమైతే సైలెంట్‌గా చూస్తూ కూర్చునేవాళ్లం కాదు? 51 చోట్ల 71 సార్లు దాడులు చేశాం.. ఇప్పుడే సినిమా ఐపోలేదు.." అని పాకిస్తాన్ ఒరిజినల్ షేప్‌ను ప్రపంచానికి చాటి చెబుతోంది బెలూచ్ లిబరేషన్ ఆర్మీ. ఈ పరిణామాలన్నీ గమనిస్తుంటే, పాకిస్థాన్ త్వరలో అనేక ముక్కలుగా విడిపోనుందా అనే ప్రశ్నలు బలపడుతున్నాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత, పెరుగుతున్న ఉగ్రవాదం, వేర్పాటువాద ఉద్యమాలు పాకిస్థాన్ సమగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఈ సవాళ్లను పాకిస్థాన్ ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందో, భవిష్యత్తులో ఈ దేశం ఏ దిశగా పయనిస్తుందో?

## పీడీఎఫ్ బియ్యం గుర్తించేందుకు

# 700 రాపిడ్ టెస్టింగ్ మొబైల్ కిట్లు

**విజయవాడ, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** రాష్ట్రంలోని వేర్వేరు పోర్టుల ద్వారా పీడీఎఫ్ బియ్యం.. విదేశాలకు తరలిపోతోంది. పౌరసరఫరాల అధికారుల తనిఖీల్లో అనేక సందర్భాల్లో ఈ విషయం బయటపడింది. కేసులు కూడా పెట్టారు. కాకినాడ పోర్ట్‌లో రేషన్ బియ్యం వ్యవహారంలో సిట్ ఎంక్వయిరీ కూడా నడు స్తోంది. ఇక విశాఖ పోర్టు నుంచి కూడా బియ్యం విదే శాలకు తరలి పోతుందనేది పౌరసరఫరాల శాఖ గట్టిగా నమ్ముతుంది. ఇటీవల తరలించేందుకు గోడౌన్లో సిద్ధంగా ఉంచిన బియ్యన్ని కూడా అధికారులు గుర్తించారు. ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్‌మెంట్‌ను మరింత పటిష్టం చేశారు. నిఖీ చేస్తున్న సమయంలో ఆ బియ్యంపై అను మానం వస్తే వాటిని ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేసిన తర్వాత మాత్రమే వాటిపై ఒక నిర్ధారణకు రావాల్సి ఉంటుంది. ఆ రిపోర్టు వచ్చే లోగా ఈ రవాణా సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయి అనేది.. గతంలో అనేక మంది ఎగుమతిదారులు పౌరసరఫరాల మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అయితే.. వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం సంస్కరణలు తీసుకువచ్చింది.. బియ్యం పై అనుమానం వచ్చిన వెంటనే చెక్ చేసి అప్పటికప్పుడు నిర్ధారించుకునేలా ఓ సరికొత్త ప్రణాళికనూ సిద్ధం చేసింది ప్రభుత్వం. పౌరసరఫరాల శాఖ ప్రత్యేక మొబైల్ ర్యాపిడ్ కిట్లను రంగంలోకి దింపింది. 700 రాపిడ్ టెస్టింగ్ మొబైల్ కిట్లను సిద్ధం చేసింది. వాటిని పౌరసరఫరాల శాఖ అధికారులకు నుంచి ఎన్ఫోర్స్మెంట్ పటిష్టం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్.. పౌరసరఫరాల శాఖలో గత సంవత్సర కాలంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా నాణ్యమైన పోర్టిఫైడ్ రైస్ ప్రజలకు అందిస్తున్నందని.. ప్రభుత్వం అందించే బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసు కుంటున్నామని అన్నారు. పిడిఎస్ బియ్యం అవునో కాదో గుర్తించడానికి 700 మొబైల్ రాపిడ్ కిట్స్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ రాపిడ్ కిట్లలో పొటాషియం థయో సైనైడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ బాటిల్స్ ఉంటాయని అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పోర్టిఫైడ్ రైస్ అయినట్లయితే.. ఈ ద్రావణాలు ఆ బియ్యంపై చల్లితే అవి ఎరుపు రంగుకు మారుతా యని.. బయట దుకాణాల్లో అమ్మే బియ్యం అయితే రంగు మారవు అని తెలిపారు. గతంలో అయితే అక్రమ బియ్యం పట్టుకున్న తర్వాత ల్యాబ్ కి పంపించడం వలన సమయం ఎక్కువగా తీసుకోవడం కోర్టులో నిరూపణ కష్టమయ్యేదని.. ఈ రాపిట్ కిడ్స్ వల్ల వెంటనే గుర్తించడానికి.. సీజ్ చేయడానికి వీలు కలుగుతుందన్నారు మంత్రి. ఎన్ఫోర్స్మెంట్లో రాజీ పడేది లేదని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని.. అవకతవకలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే పౌర సరఫరాల విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నామన్నారు. బియ్యం తీసుకొచ్చే వాహనాలను నిరంతరం తనిఖీ చేయడానికి విశాఖ పోర్టు ప్రాంతంలో మూడు అంతర్గత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గాజువాక గేట్ వే సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, శ్రవణ్ సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, బిపిఎల్ ఇంటిగ్రల్ సి.ఎఫ్.ఎస్. పెదగంట్యాడలలో మూడు చెక్పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే అవి పని చేయడం ప్రారంభించాయని చెప్పారు. ఈ చెక్ పోస్ట్ లు 24 గంటలు మూడు షిఫ్టుల్లో పని చేస్తాయని.. 33 మంది సిబ్బందిని నియమించామని మంత్రి తెలిపారుకాకినాడ పోర్టులో గతంలో జరిగిన అక్రమ రవాణా జరిపిన వారిపై చట్ట పరమైన చర్యలు.. వాహనాలు సీజ్ చేయడం జరిగిందని అన్నారు. మన దేశానికి సంబంధించిన పీడీఎస్ రైస్ మన పోర్టుల నుండి అక్రమ రవాణా జరగకూడదని.. అందుకే చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని.. ఈ విధానం కాకినాడలో విజయవంతంగా అమలు చేశామన్నారు. రాష్ట్రంలో 4 కోట్ల 42 లక్షల మందికి క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రైస్ కార్డులు అందించడం జరిగిందని, 89% మంది వీటి ద్వారా రైస్ తీసుకుంటున్నారని తెలుస్తుందన్నారు. వినియోగదారులకు బియ్యం సంబంధించిన సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాష్ట్రంలోని 29,752 చౌక ధర దుకాణాలలో ఎక్కడైనా రేషన్ బియ్యం తీసుకునే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో 5 లక్షల 35 వేల క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుంటే.. ఈ ప్రభుత్వం గత 14 నెలలో 245 కోట్ల విలువైన 5 లక్షల 65 వేల క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 230 క్రిమినల్ కేసులు పెట్టామని.. కోర్టులలో విచారణ జరుగుతుందన్నారు. విశాఖపట్నంలో కూడా అలాంటి బియ్యం అక్రమ రవాణా జరగకుండా కంటైనర్ పోర్టు సందర్శించి సమావేశాలు నిర్వహించి హెచ్చరించడం జరిగిందన్నారు. న్యాయంగా, సక్రమంగా జరిపే వ్యాపారానికి ఆటంకాలు కలుగకుండా సహకరిస్తామని అప్పుడే తెలిపామన్నారు. ఎన్ఫోర్స్మెంట్ పటిష్టంగా అమలు చేస్తామని కఠినంగా కూడా వ్యవహరిస్తామని మంత్రి పేర్కొన్నారు. పోర్టిఫైడ్ రైస్ అంటే 100 కేజీల బియ్యం లో ఒక కేజీ మల్టీ విటమిన్ మిక్స్, ఐరన్ తో కూడిన రైస్ కలుపుతారని.. అన్నారు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్. వీటి పై ప్రజల్లో ప్లాస్టిక్ బియ్యం అనే అపోహ ఉన్నదని, నిజానికి బియ్యాన్ని పిండి చేసి దానిలో దాన్లో మల్టీ విటమిన్ మిక్స్ కలుపుతారన్నారు. ఇది సాధారణ బియ్యం కంటే పోషక విలువలు కలిగిన ఆహారం అని ఆయన పేర్కొన్నారు.

# నోబెల్ బహుమతులు వారికే ఎందుకొస్తాయి...

**న్యూఢిల్లీ, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డు నోబెల్ బహుమతి. మానవాళికి అత్యుత్తమ సేవా అందించిన వ్యక్తులకు, సంస్థలకు ఈ నోబెల్ బహుమతిని అందిస్తారు. చేయడానికి చెందిన ప్రఖ్యాత శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త అయిన ఆల్ఫ్రేడ్ బెర్నడ్ నోబెల్ 1867లో డైనమైట్ ను కనుగొన్నారు. దీని ద్వారా ఆయన అత్యధికంగా డబ్బులు సంపాదించారు. అయితే ఆయన కనుగొన్నది డైనమైట్ దేనినైనా విధ్వంసం చేస్తుంది. తాను కనుగొన్నది విధ్వంసం చేసేది అని బాధపడ్డాడు. నీతో 1896లో ఆయన మరణించే ముందు తన ఆస్తిలో ఎక్కువ భాగాన్ని ఓ ట్రస్ట్ కు రిజర్వ్ చేశాడు. ఈ డబ్బు పై వచ్చే వడ్డీతో మానవాళికి ప్రయోజనకరమైన కృషి చేసిన వారికి బహుమతులు ఇవ్వాలని తన వీలునామాలు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 1900వ సంవత్సరంలో నోబెల్ పేరు మీద ఫౌండేషన్ స్థాపించారు. 1901 లో మొదటిసారి నోబెల్ బహుమతిని ప్రదానం చేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఎక్కువ శాతం యూదులకు మాత్రమే నోబెల్ శాంతి బహుమతులు వస్తున్నాయి? అలా ఎందుకు? నోబెల్ బహుమతి చరిత్రను పరిశీలిస్తే సుమారు 22 శాతం వరకు యూదులకే వచ్చింది. ప్రపంచ జనాభాలో యూదుల శాతం 0.2 శాతం మాత్రమే. కానీ వారి నిష్పత్తి కంటే 100 రేట్లు ఎక్కువగా బహుమతులు గెలుచుకోవడం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. యూదుల్లో విద్యకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. చిన్నప్పటి నుంచే చదవడం, రాయడం వంటివి నేర్చుకుంటారు. మిగతా వారి కంటే వీరిలో అక్షరాస్యత శాతం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచంలో యూదులు ఏదైనా అధ్యయనం చేస్తే అది పక్కాగా ఉంటుంది. ప్రతి విషయాన్ని వారు గుడ్డిగా నమ్మరు. దానిపై పరిశోధనలు చేసి అసలు విషయం తెలుసుకుంటారు. విమర్శనాత్మకంగా ఆలోచన చేసి సరికొత్త ఆవిష్కరణలకు ప్రయత్నిస్తారు. సమాజంలో యూదుల బహిష్కరణ ఎక్కువగా ఉంటుంది. 2000 సంవత్సరాలుగా వీరు ప్రపంచవ్యాప్తంగా చెల్లాచెదురయ్యారు. ఇలా ఎక్కువగా వివక్షకు గురి కావడంతో కసి పెంచుకొని అనుకున్నది సాధించేలా ముందుకు వెళ్లారు. యూదులకు ఒకచోట ఉండడం అసలు ఇష్టం ఉండదు. సాంప్రదాయ వృత్తులకు వీరు దూరంగా ఉండి ఎక్కువగా జ్ఞానం పైనే దృష్టి పెడతారు. వీరిని ఎంతమంది విమర్శించినా.. వారి జీవనశైలిని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకున్నారు. జీవనోపాధి ఎక్కడ ఉంటే అక్కడికి తరలి వెళ్తారు. యూదుల కుటుంబాల్లో తల్లిదండ్రులు విద్యకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. ఎలాంటి వైఫల్యాలు ఎదురైనా.. వాటిని కట్టుకొని ముందుకు వెళ్లేలా చిన్నప్పటి నుంచే శిక్షణ ఇస్తారు. విజయం ఎలా సాధించాలో పలు రకాలుగా వారికి నేర్పుతూ ఉంటారు. యూదుల గురించి ఒకరి ద్వారా ఒకరు తెలుసుకున్న తర్వాత తమ మనుగడను కాపాడుకోవాలని ఎన్నో రకాలుగా పోరాటాలు చేస్తూ ఉంటారు. వీరిలో అత్యంత ప్రతిభావంతులు అయి ఉండడం వల్ల పరిశోధన రంగంలో విజయవంతం కావడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తారు. ఈ విధంగా యూదులు విజయం కోసం ఎక్కువగా శ్రమించి ప్రపంచంలో ప్రత్యేకంగా నిలుస్తారు. అందుకే వారికి ఎక్కువగా నోబెల్ బహుమతులు వస్తుంటాయి.



# గులాబీ పార్టీలో గ్రూపుల లొల్లి

**మెదక్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో గులాబీ పార్టీలో గ్రూపు విభేధాలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్రెడ్డి మూడు గ్రూపులుగా విడిపోయారు. ఏదైనా పార్టీ పెద్దలు హాజరయ్యే కార్యక్రమానికి మినహా ఇతరత్ర కార్యక్రమాల్లో ఎడమొహం పెడమొహంలా వ్యవహరిస్తుండడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్రెడ్డి హాజరయ్యారు. కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాత్రం కనిపించలేదు. ఏమిటని ఆరా తీస్తే తనకు ఆహ్వానం లేదని అందుకే హాజరుకాలేదని తెలిసింది. కాగా ఆదివారం కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తన సొంత మండలం నిజాంపేటలో కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్మాదేవేందర్రెడ్డి, శేరి సుభాష్రెడ్డి హాజరుకాలేదు. ఈ కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సమయంలో రానున్న ఎన్నికల్లో మెదక్ నుండి పోటీ చేస్తారా అన్న ప్రశ్నకు కంఠారెడ్డి స్పష్టంగా సమాధానం ఇచ్చారు. రానున్న రోజుల్లో మెదక్ అసెంబ్లీ సీటు తనకేనని, అధిష్టానంపై తనకు నమ్మకం ఉందని, కచ్చితంగా తాను పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో ఒక్కసారిగా పద్మాదేవేందర్రెడ్డి వర్గీయులతో పాటు ఇతరులకు మింగుడు పడకుండా అయిందని ప్రచారం. మెదక్ అసెంబ్లీ సీటుపై గులాబీ పార్టీలో ఇప్పటి నుండే పోటీ నెలకొంది. ఇప్పటికే నియోజకవర్గంలో మూడు వర్గాలుగా విడిపోయి కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం పద్మాదేవేందర్రెడ్డి వ్యవహార శైలితో కార్యకర్తలు దూరం పెట్టడంతోనే ఓటమి పాలయ్యారు. తిరుపతిరెడ్డి బీఆర్ఎస్లో చేరకముందు నియోజక వర్గంలో పద్మకు, శేరి సుభాష్రెడ్డి మధ్య విబేధాలు పొడచూపాయి. రెండు గ్రూపులుగా పార్టీ కార్యకర్తలు వ్యవహరించా రు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో టికెట్టు దక్కకపోవడంతో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బీఆర్ఎస్లో చేరారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, కంఠారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కొనసాగించిన వ్యవహార శైలితో పద్మా దేవేంద్రెడ్డి వర్గీయులకు మింగుడు పడలేదు. నియోజకవర్గంలో పార్టీలకతీతంగా కంఠారెడ్డి కార్యకర్తలను ఆదుకోవడం, ఆర్థిక సహాయం చేయడంతో మంచి గుర్తింపు రావడంతో అసెంబ్లీ సీటుకు పోటీ పెరిగినట్లు భావిస్తున్నారు. పద్మదేవేందర్రెడ్డి, తిరుపతిరెడ్డి మధ్య దూరం పెరిగిపోయినట్లు తెలుస్తోంది. పలుమార్లు పార్టీ కార్యక్రమాలకు తిరుపతిరెడ్డికి ఆహ్వానం లేకపోవడంతో ఆయన కూడా తన మద్దతును పెంచుకుంటూ వెళ్తున్నారు. మరోవైపు శేరి సుభాష్రెడ్డి మౌనంగా పరిశీలి స్తున్నట్లు తెలిసింది. అయితే కంఠారెడ్డి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తనకే సీటు ఇస్తారని, అధిష్టానం మాట ఇచ్చిందని మీడియా ముఖంగా స్పష్టం చేస్తుండడం పట్ల పద్మ వర్గీయుల్లో ఆందోళన మొదలైంది. ఓవైపు అధికారం కోల్పోయి బీఆర్ఎస్ పోరాటం సాగిస్తున్న నేపథ్యంలో సొంత పార్టీలోనే గ్రూపు విబేధాల తలనొప్పి ఎక్కువవుతుందని భావిస్తు న్నారు. మాజీ మంత్రి హరీశ్రావు ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో, గ్రూపు విబేధాలు సద్దుమణిగేలా చేస్తారా అనేది వేచిచూడాల్సిందే.



## రబీ సీజన్ వరి ధాన్యం బహిరంగ వేలం



**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** రబీ 2024-25 సీజన్‌లో పండించిన వరి (RNR-15048 రకం) తడిచిన మరియు రంగు మారిన ధాన్యాన్ని బహిరంగ వేలం ద్వారా విక్రయించడం కనేకల్‌లోని సహాయ వ్యవసాయ సంచాలకుల (ఫారము) కార్యాలయంలో ఈరోజు జరిగింది. ఈ వేలం కార్యక్రమానికి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నారాయణ నాయక్ అధ్యక్షత వహించారు. బహిరంగంగా నిర్వహించిన ఈ వేలంలో పలువురు వ్యాపారులు పాల్గొని ధాన్యానికి ధరలు ప్రతిపాదించారు. వేలం ప్రక్రియలో అత్యధిక ధర క్వింటాకు రూ. 1550/- చొప్పున ఇచ్చిన శ్రీ సత్యనారాయణ మూర్తి గారికి వేలం ఖరారు చేయబడింది. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయ సిబ్బంది సక్రియంగా పాల్గొని వేలం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## శ్రీసాయి డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీలు



**గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో శ్రీసాయి క్యాంపస్ సీఈఓ శ్రీరాములు, శ్రీసాయి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు రెడ్డి,పిఆర్ఆర్ ఎంబీఏ కళాశాల డాక్టర్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో జీఎస్టీపై కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ వ్యాసరచన పోటీలలో 200 మంది విద్యార్థులు పాల్గొన డం జరిగింది. అనంతరం వ్యాస రచన పోటీలలో ప్రతిభ కనబరిచిన 9మంది విద్యార్థిని విద్యార్థు లకు బహుమతులు, సర్టిఫికెట్ ఇవ్వడం జరిగినది. అదే విధంగా ఈ జిఎస్టి వ్యాసరచన పోటీలో పాల్గొన్నా విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు అందించడం జరిగినది. ఈ సందర్భంగా వక్తలు స్వరూప,వినోద్ మాట్లాడుతూ ప్ర భుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల కలిగే లాభాల గురించి అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం రంగస్వామి రెడ్డి, మస్తాన్ వలి,పిఈటి రవికుమార్, యాగంటీశ్వరుడు రామాంజనేయులు, చంద్రశేఖర్, సుధాకర్ రెడ్డి, నాగ విశాల, ఆఫ్రిన్ తాజ్, రేష్మ,షాను, కౌసర్, సావిత్రి, సంధ్య, తదితరులు పాల్గొనడం జరిగినది.

## మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

◆ జిల్లా విద్యాశాఖ ఏడీ వినయ్ మోహన్



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** విద్యార్థులకు నాణ్యతగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండి పెట్టాలని సత్య జిల్లా విద్యాశాఖ కార్యాలయం వినయ్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా గోరంట్ల మండలంలోని జిల్లా పరిషత్ బూదిలి ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు,తప్పనిసరిగా విద్యార్థులకు నాణ్యతగా ఇవ్వాలన్నారు లేకపోతే చర్యలు తీసుకుంటా మన్నారు,ప్రధానోపాధ్యాయులు పాఠశాల సిబ్బందితో మధ్యాహ్న భోజన పథకం పట్ల అడిగి తెలుసుకున్నారు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచనలు చేశారు.

## ప్రధాన మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

◆ అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



**రాయచోటి, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** ఈ నెల 16 వ తేదీన కర్నూలు నందు జరిగే సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్ బారి బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. అందులో భాగంగా వారి పర్యటనకు సంబంధించి సూచించిన ప్రాంతాలలో ఏర్పాట్ల పై రాయచోటి తహశీల్దార్ నరసింహ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ సైకం వంశీ రెడ్డి ఇతర అధికారులకు సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న అన్నమయ్య జిల్లా జేసి ఆదర్శ్ రాజేంద్రన్. ప్రధాన మంత్రి పర్యటనను ఎటువంటి పొరపాటులకు తావులేకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు సూచించారు.

# సీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలందించాలి

◆ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్






**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం రైల్వే కోడూరు పట్టణంలోని సీహెచ్‌సీని సందర్శించి, ఆరోగ్య సదుపాయాలను, వైద్య సేవల స్థితిగతులను కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పరి శీలించారు. జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని ఈసీజీ రూమ్, క్యాజువాలిటీ వార్డు,ఆపరేషన్ థియేటర్ ఐసోలేషన్ - ఓటి, ఎల్.డి.ఆర్ యూనిట్, ప్రిపరేషన్ రూమ్ మరియు ప్రసూతి వార్డును పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రధాన వైద్య అధికారి మరియు ఇతర వైద్యులతో రోజు ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషంట్, ఇన్‌పేషెంట్ సంఖ్య, వారికి అందిస్తున్న చికిత్స, వైద్య సిబ్బంది సమన్వయం తదితర అంశాలపై సమగ్రంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైల్వే కోడూరు ప్రజలకు కొత్తగా నిర్మించిన నూతన కమ్యూనిటి హెల్త్ సెంటర్ అందుబాటులోకి వచ్చిందని ఇన్ పేషెంట్ వార్డ్స్ ఇవన్నీ కూడా పాత భవనం నుండి కొత్త భవనంలోకి మార్చడం జరిగిందని తెలిపారు. ఈ ఆసుపత్రిలో డెలివరీలు ప్రస్తుతానికి బాగానే జరుగుతు న్నాయని గైనకాలజిస్ట్ పోస్టు ఒకటి ఖాళీగా ఉందని వెంటనే ఆ పోస్టును భర్తీ చేయడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లేబర్ రూమ్ లో ఉన్న అన్ని సౌకర్యాలు అన్ని మెడిసిన్స్ అన్ని ఎక్విప్మెంట్స్ పరికరాలన్నీ సరిగా ఉన్నాయా లేదా ఇవన్నీ కూడా చెక్ చేయడం జరిగింది. ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఆక్సిజన్ ప్లాంట్ అవసరం ఉందని స్థానిక శాసన సభ్యులు మరియు డాక్టర్స్ మా దృష్టికి తీసుకొచ్చారు ఒక ఆక్సిజన్ జనరేటర్ ఏర్పాటు చేయడానికి నివేదికలు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వంకి పంపడం జరుగుతుందని తెలిపారు. దీని ద్వారా ఈ హాస్పిటల్ ఒక మంచి కేర్ ట్రీట్మెంట్ ఇవ్వడానికి సిద్ధమవుతుంది. రెఫరల్ ఫెసిలిటి ఉన్నా సరే మన జిల్లా పేషెంట్స్ అందరికీ ఇక్కడే మంచి వైద్యం మరియు అన్ని రకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అంతకుముందు క్యాజువాలిటి, ప్రసతి వార్డు లోని రోగులను వారికి అందజేస్తున్న వైద్యం మరియు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావే శంలో శాసన సభ్యులు ఆరవ శ్రీధర్ మాట్లాడుతూ.. కోడూరు సిహెచ్‌సి ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించడం జరిగిందని, ఈ సిహెచ్సి సెంటర్లో ఒక ఆక్సిజన్ ప్లాంట్, సిఐపి బెడ్స్ తక్కువ ఉన్నాయని, ఆసుపత్రి డాక్టర్లు మరియు సిబ్బంది కొరత ఉందని ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని వారు వెంటనే స్పందించి వీటికి సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు నివేదికలు తయారుచేసి ప్రభుత్వం దృష్టికిపంపి వాటిని పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారని అన్నారు. అదే విధంగా ఏ ఒక్క పేషెంట్ కూడా ఇక్కడికి వచ్చి వైద్యం సరిగా అందలేదని చెప్పకుండా వారికి మెరుగైన వైద్యం అందించే విధంగా డాక్టర్స్, వైద్య సిబ్బంది పనిచేయాలని శాసనసభ్యులు కోరారు. ఈకార్యక్రమంలో డి.సి.హెచ్.ఎస్. ఆంజనేయులు, డాక్టర్స్ బ్రహ్మకుమారి, ధనుశ్రీ, పృథ్విని, ఇతర ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొక్కంటి క్రాస్‌లో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన




**తనకల్లు, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** మండల పరిధిలోని కొక్కంటిక్రాస్‌లో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ప్రజ లకు అవగాహన కలిగిస్తూ మధ్యతరగతి వర్గాలకు కూటమి ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఎంపీడీవో రామనాయక్ తెలిపారు. దేశవ్యాప్తంగా తక్కువ జీఎస్టీ రేట్లు వర్తిస్తాయి. గతంలో ఎక్కువ జీఎస్టీ ఉండటం వల్ల మధ్యతరగ కుటుంబాలు బడుగు బలహీన వర్గాలు ఇబ్బంది పడేవారు. ప్రతి వస్తువు పైన జిఎస్టి ఉండేది ఎవరు కూడా కొనలేకపోయేటోళ్లు. ఈరోజు దేశవ్యాప్తంగా జిఎస్టి తగ్గించటం వల్ల వ్యాపారస్తులు ప్రజలు చాలా సంతోషపడుతున్నారు. జీఎస్టీ ఎప్పుడు తగ్గిందో వ్యాపారాలు కూడా పెరిగాయని నిత్యవసర వస్తువులు దుస్తులు పాదరక్షలు మందులు రోజువారి నిత్యవసర వస్తువులు ఆరోగ్య జీవిత బీమా వీటన్నిటిపైన జిఎస్టి తగ్గించడం వల్ల ప్రజలు చాలా సంతోష పడుతున్నారని అదేవిధంగా ట్రాక్టర్ కారు టూ వీలర్ టెలివిజన్ ఎయిర్ కండిషన్ వీటన్నిటి పైన కూడా జిఎస్‌టి తగ్గించడం వల్ల ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి కొనడానికి బారులు తీరాలని వ్యాపారస్తులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామనాయక్, తనకల్లు హాస్పిటల్ డెవలప్మెంట్ డైరెక్టర్ సోంపాలెం నాగభూషణం క్లస్టర్ ఇంచార్జ్ పీజీ మల్లికార్జున జనసేన సీనియర్ నాయకులు కొట్టి కుమార్ ఎంపీటీసీ అమర్ కార్తికేయ సర్పంచ్ ఉత్తన్న నాయక్ వివో ఆర్ డి వెంకటేశ్వర్లు సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్న వేణుగోపాల్ నాయుడు షామీర్ భాష జనసేన ఫయాజ్ భాష బిసినవారిపల్లి సాంబ రమేష్ నాయక్ రియాజ్ వెంకటరమణ గంగులప్ప వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండీల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

**టమోటా రైతులకు న్యాయం చేయండి - ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి**




**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** అన్నమయ్య జిల్లా పరిధిలోని గుర్రంకొండ టమోటా మార్కెట్లో రైతులను దగా చేస్తున్న మం డీల వ్యాపారులపై అధికారులు విచారించి తగు చర్యలు తీసుకొని టమోటా రైతులకు న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సిపిఐ జిల్లా కార్యాలయంలో మీడి యాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పరిధిలోని గుర్రం కొండలో గల టమోటా మార్కెట్ యార్డులో మండీల యజ మానులు రైతులను దగా చేస్తున్నారని చెప్పారు. రైతులు తాము కష్టపడి పండించిన 100 టమోటా బాక్సులను మార్కెట్ తీసుకెళ్తే అందులో 20 బాక్సులను జాక్పాట్ కింద తీసేయడం జరుగుతోందన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం కూడా ఇలాగే జరుగుతోందని రైతులు చెప్పడంతో రైతు సంఘం నేతలు అక్కడికి వెళ్లి రైతులను విచారించడం జరిగిందన్నారు. అయితే అక్కడ ఉన్న రైతులు మాట్లాడుతూ ఈరోజు మీ వెంట వస్తే మరుసటి రోజు మా మండిల రావద్దు మీరు ఇష్టానుసారంగా అమ్ముకోండి అని మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తారని రైతులు భయపడుతున్నారని ఆయన చెప్పారు. అక్కడ ఉన్న మండి యజమానులు విచారిస్తే ఇక్కడ ఎటువంటి అక్రమాలు జరగలేదని యజమానులు తెలియజేశారన్నారు. గుర్రంకొండ టమోటా మార్కెట్లో రైతులకు జరుగుతున్న అన్యాయంపై కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా అప్పట్లో జిల్లా కలెక్టర్ మార్కెంగ్ శాఖ ఏడిని పిలిచి ఆ సమస్యను చూడాలని చెప్పాడన్నారు. అయితే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఎటువంటి విచారణ జరపకుండా కాలయాపన చేస్తూ రైతులకు వ్యాపారాలకు మధ్య ఘర్షణలు ఘర్షణలు జరిగే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గుర్రంకొండ టమోటా మార్కెట్లో రైతులు జరుగుతున్న అన్యాయంపై ఎటువంటి చర్యలు తీసుకొని మార్కెట్ సెక్రటరీ తో పాటు వ్యవసాయ మార్కింగ్ శాఖ ఏడి పై జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని టమోటా రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోక పోతే అక్కడున్న రైతులతో కలిసి పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాయచోటి ఏరియా అధ్యక్షులు హరినాథ్ నాయుడు,కౌన్సిల్ సభ్యులు అంజద్ అలీ ఖాన్,రామాపురం మండలం అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి,కార్యదర్శి షబ్బీర్ భాష,రామాపురం మండల సిపిఐ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రాపకం కోసం ఆ ముగ్గురు పడరాని పాట్లు

**తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని మోడీకి తాకట్టు పెట్టిన చంద్రబాబు - ఏపీసిసి అధికార ప్రతినిధి, ప్రకాశం డిసిసి అధ్యక్షులు షేక్ సైదా**



**రాయచోటి, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** జీఎస్టీ 2.0 విజయోత్సవ సభ పేరుతో ఈనెల 16వ తేదీ కర్నూల్లో ఎన్డీఏ కూటమి సారథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రధాని మోడీని పిలిచి సభను నిర్వహించి సన్మానం చేయాలనే తలంపు సరైనది కాదని ,ఇది తెలుగు వారి ఆత్మ గౌర వాన్ని మోడీకి తాకట్టు పెట్టడమే నని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 3,220 ఆర్టీసీ బస్సులు, వేలాది వాహనాలు ఏర్పాటు చేసి దాదాపు నాలుగు లక్షల మంది ప్రజలను సమీకరించి కోట్లాది రూపా యల ప్రజాధనం ఖర్చు చేసి ఈ సభ పెట్టడం సమంజసం కాదని, అసలే రాష్ట్ర ప్రభుత్వం పీకల్లోతు అప్పుల్లో కోరుకుని పోయిందని ఇలాంటి పరిస్థితుల్లో అప్పు చేసి పప్పు కూడు అన్న చందంగా చంద్రబాబు వ్యవహరించడం తగదని షేక్ సైదా తీవ్రంగా విమర్శించారు. మోడీ తన పదకుండేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ కి చేసిందేమీ లేదని, అలాంటి ప్రధాని మోడీ ప్రాపకం కోసం చంద్రబాబు, జగన్, పవన్ కళ్యాణ్ లు పోటీ పడుతున్నారని సైదా ఎద్దేవా చేశారు. జీఎస్టీ పేరుతో గబ్బర్ సింగ్ టాక్స్ దేశ ప్రజలపై మోపి 100 లక్షల కోట్లు దేశ ప్రజల నుంచి దోచుకుని, ఇప్పుడు జీఎస్టీ తగ్గింపు పేరుతో నాటకం ఆడుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. అలాంటి ప్రధాని మోడీ ప్రాపకం కోసం చంద్రబాబు, జగన్, పవన్ లు భజన బృందంగా మారి రాష్ట్ర ప్రయోజనా లను ,హక్కులను మోడీకి పణంగా పెట్టి తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ఢిల్లీ నడివీధుల్లో మంటగలుపుతు న్నారని సైదా ఈ సందర్భంగా తీవ్రంగా విమర్శించారు.

# కేజీబీవీ ఆదర్శ పాఠశాలలో కలెక్టర్ తనిఖీలు





**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒబులవారిపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని (కేజీబీవీ) మంగళవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిసరాలను, విద్యార్థుల విద్యా పరిస్థితులను, మౌలిక సదుపాయాలను కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ తో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న బాలికలతో మాట్లాడి వారి విద్య సామర్థ్యాలను పరిశీలించారు. వారికి పాఠశాలలో అందిస్తున్న వసతులు, భోజన నాణ్యత, బోధన విధానం వంటి అంశాలపై అడిగి వివరాలు తెలుసుకున్నారు. తదుపరి కలెక్టర్ గారు పాఠశాల త్రాగునీటిని, వంటశాలను, పరిశీలించి, అక్కడ వండుతున్న ఆహారం పరిశుభ్రత, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని వంటకు ఉపయోగిస్తున్న పదార్థాలను పరిశీలించారు. కూరగాయలు ఎక్కడినుంచి వస్తున్నాయని, ఏజెన్సీ వారు సమయానికి కూరగాయలు పంపిస్తున్నారా తాజా కూరగాయలను ఉపయోగించి రుచికరంగా మరియు పోషక విలువలతో కూడిన ఆహారం మరియు విద్యార్థినుల



ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు ఏలాంటి అనారోగ్య సమస్యల బారిన పడకుండా తరచుగా ఏఎన్ఎంలు తరచుగా పరీక్షలు నిర్వహించాలని, అలాగే తరచుగా వారికి ఆనారోగ్య భారిన పడకుండా సలహాలు సూచనలు ఇవ్వాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. అలాగే విద్యార్థినుల విద్యా ప్రగతిని ప్రతి నెల సమీక్షిస్తూ, విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస స్థాయిని గుర్తించి, దాన్ని మెరుగుపరచే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. అంతేకాకుండా విద్యార్థినుల సమగ్ర అభివృద్ధి కోసం క్రీడా కార్యక్రమాలు, మరియు ఇతర అనుబంధ కార్యక్రమాలలో ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల పరిశుభ్రత, వసతి గృహాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాలికల భవిష్యత్తు బలపడాలంటే మంచి విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, క్రీడా ప్రోత్సాహం, మరియు క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచడానికి సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న భవనాన్ని సందర్శించి ప్రభుత్వం నిర్ణయించిన గడువు లోపల భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని సదరు కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండల విద్యాధికారి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కనేకల్‌లో ‘ఓట్ చోర్.. గద్దీ చోడ్’ కార్యక్రమం

## గౌని ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో దొంగ ఓట్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ




**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** భారతదేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి కనేకల్ పట్టణంలో విశేష స్పందన లభించింది. కనేకల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గౌని ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు పాల్గొని తమ సంతకాలను చేసి దొంగ ఓట్లకు వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ‘ఓట్ చోర్.. గద్దీ చోడ్” అనే నినాదంతో సాగిన ఈ సంతకాల సేకరణలో ఒక్కరోజులోనే వెయ్యికి పైగా ప్రజలు తమ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా గౌని ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ “కనేకల్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి విశేషంగా ఆదరణ లభించింది. వందలాదిగా ఉన్న కార్యకర్తలు, అభిమానులు ఏకమైతే రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం తప్పదని నమ్ముతున్నాను” అన్నారు. అదేవిధంగా ఆయన పేర్కొంటూ దేశవ్యాప్తంగా మా నేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు ‘ఓట్ చోర్.. గద్దీ చోడ్’ ఉద్యమం కొనసాగుతోంది. ఆ ఉద్యమానికి సంఘీభావంగా ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేపట్టిన ఈ సంతకాల సేకరణకు ప్రజలు చూపుతున్న స్పందన పార్టీకి నూతన ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను’ అన్నారు. ఈ కార్యక్రమంలో తుంబిగనూరు రాజేశ్వర్ రెడ్డి, గౌని రాఘవేంద్ర రెడ్డి, చెరువు దొడ్డి రాముడు, మహబూబ్ బాషా (మైనారిటీ నాయకుడు), ఆటో సలాం, నూర్ బాషా, షబ్బీర్, ఫక్రుద్దీన్, రాజు, ఖలీల్, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రపంచ వేదికపై విశాఖ గూగుల్ ఏఐ హబ్ కీలకపాత్ర

## కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో ముందున్నాం - రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** ప్రపంచ వేదికపై విశాఖ గూగుల్ ఏఐ హబ్ కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విశాఖ ఏఐ హబ్ కేవలం ఆంధ్రప్రదేశ్, గూగుల్ కే కాదు... యావత్ భారతదేశానికి చారిత్రాత్మక మైందన్నారు. గూగుల్ డేటా సెంటర్ గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, విస్తృతమైన సేవలను అందించబోతోందనన్నారు. న్యూఢిల్లీలోని తాజ్ మాన్ సింగ్ హోటల్ లో విశాఖ ఏఐ హబ్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ ప్రతినిధి బృందం నడుమ కీలక అవగాహన ఒప్పందం జరిగిందనన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ లు పాల్గొన్నారు. విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న ఏఐ హబ్ కేవలం భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్ కు సేవలు అందించడం మాత్రమే కాదు ప్రపంచ వేదికపై భారత్ కీలకపాత్ర పోషించేలా చేస్తుంది. విశాఖపట్నంలో ఒక




గిగావాట్ (GW) హైపర్స్కల్ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుపై గూగుల్ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. గూగుల్ రాకతో ఎఐ సిటీగా రూపాంతరం చెందుతున్న విశాఖపట్నం. రాష్ట్రానికి భారీ ఆదాయం తోపాటు యువతకు 1.88లక్షల ఉద్యోగావకాశాలు. కూటమి ప్రభుత్వం చొరవతో, వైజాగ్లో ఏర్పడుతున్న ఏఐ సిటీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ఆసియాలో గూగుల్ చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టులలో ఒకటిగా విశాఖపట్నంలో నిలవనుంది. రాష్ట్రం ఒక స్వర్గధామంగా మారుతోంది. వైజాగ్ లో 1 గిగావాట్టు సామర్థ్యంతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం, భారతదేశాన్ని డిజిటల్ పవర్ హౌస్ మార్చే దిశగా తొలి అడుగుగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అంచనా ప్రకారం, ఈ ప్రాజెక్ట్ 2028-2032 కాలంలో సగటున సంవత్సరానికి రూ.10,518 కోట్ల జీఎస్డీపీ వాటాతోపాటు సుమారు 1,88,220 ఉద్యోగాలను సృష్టిస్తుంది. గూగుల్ క్లౌడ్ ఆధారిత ఉత్పత్తుల ద్వారా సంవత్సరానికి రూ.9,553 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుంది. మొత్తం ఐదేళ్లలో సుమారు రూ.47,720 కోట్ల ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోనుంది. సీఎం చంద్రబాబు బ్రాండింగ్, మంత్రి లోకేష్ నిరంతర కృషితో గూగుల్ 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి విశాఖకు వచ్చేసింది. దేశంలో సురక్షిత నగరాల్లో ఒకటిగా గుర్తింపు తెచ్చుకున్న గ్రేటర్ విశాఖపట్నం.. ఇప్పుడు ఐటీ, డేటా సిటీ నగరంగా రూపాంతరం కానుంది అన్నారు.

# హోంగార్డు శ్రీనివాసులు ఆత్మహత్యాయత్నం

**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** పట్టణంలోని కోటవార్డులు కాపురం ఉంటున్న హోంగార్డు శ్రీనివాసులు ( 53) విష ద్రావకం సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. అయితే సోమవారం రాత్రిలో ఆత్మహత్యయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు కనుగొని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సలు అందించారు. అయితే పుట్టపర్తి హెడ్ క్వార్టర్స్‌లో గేట్ డ్యూటీగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రిలో విధులు ముగించుకొని ఇంటికి వచ్చినట్లు తెలిపారు. అయితే ఆత్మహత్య యత్నానికి గల వివరాలు తెలియరాలేదు.

# గూగుల్ రాకతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యం

◆ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** రాష్ట్ర అభివృద్ధి దిశగా గూగుల్ క్లౌడ్ సంస్థ రాక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఏపీ అత్యధిక పెట్టుబడులను ఆకర్షించే రాష్ట్రంగా ఎదుగుతోందన్నారు. గత 12 నెలలుగా పట్టుదలగా కృషి చేసి, నేషనల్ పాలసీల్లో మార్పులు చేయించి, 2 లక్షల మందికి ఉపాధి కల్పించే రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి శ్రీ నారా లోకేష్ గారి కృషి అభినందనీయమన్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ రాకతో టెక్ రంగంలో జరిగిన విప్లవం ఎలా గేమ్‌చేంజర్ అయిందో, అలానే ఇప్పుడు గూగుల్ విశాఖపట్నంలో అడుగుపెడుతోందని, ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా మారనుందన్నారు. గూగుల్ క్లౌడ్ సంస్థ 2 లక్షల మందికి ఉపాధి కల్పించడంతో పాటు రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. విశాఖపట్టణంలో స్థాపించబోయే దేశంలోని తొలి ఏఐ హబ్ ద్వారా వ్యవసాయం, వైద్యం, విద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. సముద్రగర్భ కేబుల్ వ్యవస్థతో విశాఖ అంతర్జాతీయ కనెక్టివిటీ కేంద్రంగా మారనుందన్నారు. రాష్ట్రానికి గర్వకారణమైన ఈ అభివృద్ధి అవకాశాన్ని వైసీపీ నేతలు అడ్డుకోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే విమర్శించారు. గూగుల్ రాకతో ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి దిశగా దూసుకెళ్తుందని ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు తెలిపారు.

# ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు




**పెళ్లకూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నం చేసిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పెళ్లకూరు తహసిల్దార్ సి.హెచ్. హరికృష్ణ హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలపై ఎవరికీ వ్యక్తిగత హక్కులు లేదా స్వాధీనం ఉండదని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని జీలపాటూరు పంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డ్‌గా గుర్తించిన ఏసీ నంబర్ 0.50 సెంట్ల చెరువు పోరంబోకు భూమిని ఆక్రమణ ప్రయత్నం నుండి అధికారుల పర్యవేక్షణలో తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆర్.ఐ, వి.ఆర్.ఓ, పంచాయతీ కార్యదర్శి సమక్షంలో అక్కడ ‘ప్రవేశ నిషేధం’ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# నూతన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

◆నూతన అధ్యక్షులుగా ఈతమాను ఆదినారాయణ




**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** గోరంట్ల పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో నూతన గ్రంథాలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులుగా పి.రామలింగారెడ్డి, జీఎం సురేష్, కె.శ్రీరాములు, అధ్యక్షులుగా ఈతమాను ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీదేవి, కార్యదర్శిగా బి.శ్రీనివాస్ గుప్తా, సంయుక్త కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి డి.మురళి కృష్ణారెడ్డి, గౌరవ సలహాదారులుగా జయచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు నరహరిమూర్తి, బాషసాహెబ్ బాబయ్య, వెంకటరమణప్ప, లక్ష్మీదేవి, వెంకటరామప్ప, గ్రంథాలయ కమిటీ కన్వీనర్‌గా శ్రీధర్‌లను ఎంపిక చేశారు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రంథాలయ అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# కర్నూల్‌కు చేరుకున్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తా



**కర్నూలు క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** ప్రధాని మోదీ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. ఇవాళ జిల్లా బీ కాంప్లో ఉన్న పోలీస్ అతిథి గృహానికి ఆయన చేరుకున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో శాంతిభద్రతలపై చర్చించారు. కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

## హిజ్రానే మోసం చేసిన దంపతులు





**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** డబ్బు, బంగారం తీసుకుని హిజ్రాను ఘరానా మోసం చేసిన సంఘటన మంగళవారం అన్నమయ్య జిల్లాలో వెలుగు చూసింది. బాధిత హిజ్రా స్వాతి కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, చీకిలగుట్టలో కాపురం ఉంటున్న హిజ్రా స్వాతి దగ్గర అదే ప్రాంతానికి చెందిన దంపతులు దేశరిగి డమరేశ్వర్, స్వర్ణలత లు 2021 నుంచి సన్ని హితంగా ఉంటూండే వారని తెలిపారు. ఆ దంపతులు స్వాతి దగ్గర డబ్బు సుమారు రూ.42లక్షలు, 600 గ్రాముల బంగారు, విలువైన పత్రాలు తీసుకుని ఇవ్వకుండా తిరగబడ్డారని ఆరోపించింది. తనకు పోలీస్ స్టేషన్ కు పోయినా న్యాయం జరలేదని బాధితురాలు స్వాతి తన మోసకారి ఇంటి ముందు నిరసన ధర్నా చేసింది. తనకు న్యాయం చేయాలని మీడియాను వేడుకుంది. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న స్వర్ణలత స్పందించి మేము కోర్టులో తేల్చు కుంటామని మీడియాకు వివరణ ఇచ్చింది.

## సూపర్ జీఎస్టీపై అవగాహన కార్యక్రమం



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ.. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితమ్మ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ సందర్భంగా ర్యాలీ గా వెళ్లి ప్రతి దుకాణంలోనూ జీఎస్టీ తగ్గింపు కరపత్రాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కమలా బాయి, సర్పంచ్ సరోజ నాగే నాయక్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్య ధరణి, ఉత్తమ రెడ్డి,పట్టణ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, సర్పంచ్ నరసింహ మూర్తి, రమేష్, కలీమ్ ఖాన్, ప్రతాప్ నాయుడు, మల్లేష్, జయతో పాటు పంచాయతీసిబ్బంది, ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసిన నెలవల విజయశ్రీ





**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చట్టం శాంతిభద్రతల పరిస్థితులు, ప్రజా భద్రతా చర్యలు ప్రజా సంక్షేమ అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే గారు పోలీస్ విభాగం చేపడుతున్న ప్రజా సేవలను అభినందిస్తూ, ప్రజల భద్రత కోసం మరింత సమర్థవంతమైన చర్యలు కొనసాగించాలని సూచించారు. దొరవరిసత్రం మండలం బురదమడుగులో వరదలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తెలియజేశారు. నాయుడుపేట పట్టణంలో ముస్లిం సమాజం వినతిమేరకు ఈద్గా స్థలానికి భూమి కేటాయించాలని కోరారు. మున్సిపాలిటీలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అవసరమైన భూమిని శాప్‌కు బదిలీ చేయాలని, తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని కేటా యించే అంశంపై చర్చించారు. నియోజకవర్గంలో రైతులకు అవసరమైనన్ని యూరియా బస్తాలు అందుబాటులో ఉండేలా వ్యవసాయశాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన విజిలెన్స్ బృందం



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** గోరంట్ల పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను విజిలెన్స్ అధికారుల బృందం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలతో పాటు జరుగుతున్న పరిణామాలపై విజిలెన్స్ అధికారులు డాక్టర్. రఫిక్ భాష,సుజాత, ఏ ఓ ఓబులేసులు వైద్య సిబ్బంది అధికారులు సిబ్బందితో వేరు వేరుగా ఒక్కొక్కరిని విచారణ చేపట్టారు. అదేవిధంగా ఇటీవల జరిగిన సంఘటనలు నేపథ్యంలో ఇప్పటికే సిబ్బందిపై ఫిర్యాదు రావడంతో పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు సమయపాలన స్టాక్ రిజిస్టర్లు తదితర వాటిపై బిజినెస్ అధికారులు తనిఖీలు చేపట్టి, మెడికల్ ఆఫీసర్ ఆప్తాబ్ తో అడిగి తెలుసుకున్నారు. మంగళవారం విధులకు హాజరు కాని వైద్య ఆరోగ్య సిబ్బందికి నిమ్మలు జారీ చేయాలని ఆదేశాలు చేశారు.

# పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలి : ఎస్ఎఫ్ఐ





**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** పత్తికొండ పట్టణంలోని స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని నిర్వహించగా ముఖ్య అతిథులుగా సిఐటియు మండల కార్యదర్శి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని గత ప్రభుత్వం కూడా ఫీజు రియంబర్స్మెంట్ తల్లుల ఖాతాల్లో వేసి విద్యార్థులకు అనేక ఇబ్బందులకు గురి చేశారని కూటం ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయడం వహిస్తుందని ఈ సంవత్సరం అకాడమీ ఇయర్లో ఇంకా ఫీజు రియంబర్స్మెంట్ కాలేజీ ఇలా ఖాతాలో వేయకుండా జాప్యం చేయడంతో కాలేజీల యాజమాన్యం పిల్లల తల్లిదండ్రులతో ఫీజులు వసూలు చేస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని వెంటనే సంబంధిత కాలేజీల్లో ఫీజు రియంబర్స్మెంట్ జమపరిచి విద్యార్థుల పైన విద్యార్థి తల్లిదండ్రుల పైన భారం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు.

### పత్తికొండ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ

పత్తికొండ ఎస్ఎఫ్ఐ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఏ.జోష్ణ కుమారి, ఏ. విష్ణువర్ధన్‌ను ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా సోమేశ్, సహాయ కార్యదర్శిగా కే. శివ, పి. విష్ణు, కే. నరేంద్ర, నాగరాజులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఎం. ధర్మ తేజ, వినయ్ కుమార్ ఆచారి ఉదయ్ భరత్, ఎస్.తరుణ్, అరవింద్, దస్తగిరులను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ.నాగరాజు, కే.శివ, ఎం. ప్రభాస్, జె. వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## గూగుల్ డేటా సెంటర్ రాకపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి హర్షం - హైదరాబాద్‌లో హైటెక్ సిటీ.. విశాఖలో గూగుల్ డేటా సెంటర్

### సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల కృషికి ఇది నిదర్శనం -ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

## టెక్ ప్రపంచంలో ఏపీకి చారిత్రాత్మక రోజు



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడం వలన టెక్ ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇది ఒక చారిత్రాత్మకమైన రోజుగా మిగిలిపోతుందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదరడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఇది ఒక సువర్ణ అధ్యయంగా మిగిలిపోతుందని తెలిపారు. గూగుల్ ఆంధ్రప్రదేశ్‌కి రావడం వలన.. డిజిటల్ ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కొత్త మార్పులు ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వలన మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ వచ్చిన తరువాత అనేక ఐటీ కంపెనీలు అక్కడికి వచ్చాయన్నారు. హైటెక్ సిటీతో ప్రపంచ ఐటీ రంగంలో హైదరాబాద్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఏర్పడిందన్నారు. అదే విధంగా గూగుల్ రాకతో ఏపీలోని విశాఖకు కూడా అదే స్థాయి గుర్తింపు వస్తుందన్నారు. ఐటీ రంగం మరింత ఊపు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో 1.88 లక్షల మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. గత 16 నెలలుగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషికి నిదర్శనం గూగుల్ డేటా సెంటర్ రావడమేనన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు విశేష కృషి చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కళాశాల మైదానంలో ప్లాస్టిక్ చెత్తా చెదారాలు

### అపరిశుభ్రంగా మారిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** అనంతపురం నగరంలోని స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్లాస్టిక్ బాటిల్స్, చెత్తలతో మైదానమంతా అపరిశుభ్రంగా మారిపోయింది. మూడు రోజుల కిందట ఒక కంపెనీ రిఫ్రెష్మెంట్ క్రికెట్ మ్యాచ్ కొరకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగింది. ఈ సందర్భంగావారు కంపెనీకి సంబంధించిన ఉద్యోగు లకు అక్కడే అల్పాహారం ఏర్పాటు చేశారు. అల్పాహారాన్ని తినేసి ప్లేట్లు, వాటర్ బాటిల్స్ అక్కడే పడేయడంతో మైదానంలో ప్లాస్టిక్ చెత్త పేరుకుపోయింది. దీంతో పరిస రాలు అపరిశుభ్రంగా మారాయి. నిత్యం కళాశాల మైదా నంలో చాలా మంది జాగింగ్‌కు వస్తుం టారు. వారికి ఈ ప్లాస్టిక్ బాటిల్స్, చిత్తు చెత్త ఉండడం వాకర్స్‌కు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళాశాల మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆర్సన్ సైన్స్ కాలేజ్ వాకర్స్ కోరుతున్నారు.



# తల్లంపాడులో పారిశుధ్యం అస్తవ్యస్తం!

- చెత్తకుప్పలు, మురికిగుంటలు, దోమల దాడితో ప్రజలు అవస్థలు
- 'క్లోరినేషన్ అయిన చేయండి సార్' అంటూ
- అధికారులను వేడుకుంటున్న గ్రామస్తులు

**దొరవారిసత్రం, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలోని తల్లంపాడు, మోదుగుల పాలెం గ్రామాలు ఈ మధ్య కాలంలో తీవ్ర పారిశుధ్య సమస్యలతో అల్లాడుతున్నాయి. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, పేడ దిబ్బలు, మురికిగుంటలు దర్శనమిస్తూ ఉన్నాయి. పగిలిపోయిన త్రాగునీటి పైపుల ద్వారా లీకైపోతున్న నీరు వీధుల మీద ప్రవహిస్తూ మలినజలాలతో కలిసిపోతుంది. ఫలితంగా త్రాగునీరు కూడా కలుషితమై ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారింది. ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ - స్వచ్ఛ ఆంధ్ర, ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలు కాగితాలపైనే నిలిచిపోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ప్రతి శుక్రవారం డ్రై డే జరుగుతుందని చెబుతున్నారు కానీ మా గ్రామాల్లో ఒక్కసారి కూడా శుభ్రతా కార్యక్రమం జరగడం లేదు" అని వారు వాపోతున్నారు. రాత్రివేళలలో దోమల దాడి విపరీతంగా పెరిగిపోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చిన్నారులు జ్వరాలతో బాధపడుతున్నారని, ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. "కనీసం మురికిగుంటల వద్ద బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ చేసినా మాకు ఉపశమనం లభిస్తుంది" అంటూ గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యాన్ని తక్షణం సరిదిద్దాలని, సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.







# నా క్యారెక్టర్ షాకింగ్‌గా ఉంటుంది

'తెలుసు కదా'లో నేను చేసిన వరుణ్ క్యారెక్టర్ ఒక ఎక్స్‌పీరియన్స్‌ని క్రియేట్ చేస్తుంది. తను మామూలుగా ఉన్నప్పటికీ తన ఆలోచనలు చాలా రాడికల్‌గా ఉంటాయి. నా క్యారెక్టర్ సినిమాలో 23 నిమిషం తర్వాత ఒక వైల్డ్ టర్న్ తీసుకుంటుంది' అని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. 'మిరాయ్' లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. స్టైలిస్ట్-ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ఈనెల 17న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో సిద్ధు



జొన్నలగడ్డ మంగళవారం మీడియాతో ముచ్చటించారు. దర్శకురాలు నీరజ చెప్పిన కథలో ఒక యూనిక్ నెస్ ఉంది. కథ చాలా బాగుంది. దానికి తగ్గట్టు క్యారెక్టరైజేషన్స్ ఉన్నాయి. ఇందులో నా క్యారెక్టర్ చాలా స్ట్రాంగ్‌గా ఉండబోతుంది. కచ్చితంగా ఆడియన్స్‌ని షాక్ చేస్తుందని నమ్ముతున్నాను. అలాగే మంచి హ్యూమర్ కూడా ఉంటుంది. ట్రైలర్ రిలీజైన తర్వాత సినిమా మీద అద్భుతమైన బజ్ వచ్చింది.

మేం ఏదైతే చూసి ఎక్సైట్ అయ్యామో, ఆడియన్స్ కూడా అదే ఫీల్ అవుతారు. ఇందులో మీరు 80% కొత్త సీన్స్ చూస్తారు. లవ్ స్టోరీ, లవ్ మ్యారేజ్, ఫ్యామిలీ రిలేషన్ షిప్ గురించి డిస్కర్షన్ ఉంటుంది. కానీ ప్రతి సీను చాలా కొత్తగా ఉంటుంది. డైరెక్టర్ నీరజ చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్స్‌తో వచ్చారు. రాశి, శ్రీనిధి క్యారెక్టర్స్ స్ట్రాంగ్ ఉంటాయి. వాళ్ళకి మించిన స్ట్రాంగ్ క్యారెక్టర్ హీరోది. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత దీనికంటూ ఒక జోనర్ ఏర్పడుతుందని భావిస్తున్నాను. సినిమాలో లవ్, లైఫ్ గురించి డైలాగ్స్ చాలా హార్డ్ హిట్టింగ్‌గా ఉంటాయి. విశ్వ, కృతితో నాకు మంచి అనుబంధం ఉంది. దేనికి వెనకడుగు వేయరు. జ్ఞాన శేఖర్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. తమన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రెండు సాంగ్స్ బ్లాక్ బస్టర్స్ అయ్యాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. తమన్ మ్యూజిక్ ఈ సినిమాకి బిగ్ అసెట్. ఎడిటర్ నవీన్ చాలా హార్డ్ వర్క్ చేశారు. అవినాష్ గ్రేట్ సెట్ వర్క్ చేశారు. నీరజ ఫస్ట్ టైమర్ అయినప్పటికీ వీళ్ళ అందరితో కలిసి అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చారు.

# 'మీసాల పిల్ల..' సందడి షురూ

చిరంజీవి, నయనతార జంటగా నటించిన చిత్రం 'మన శంకర వర ప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకుడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను అర్చన సమర్పిస్తున్నారు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'మీసాల పిల్ల' పూర్తి లిరికల్ వీడియో విడుదలైంది. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ ట్రాక్ పవర్‌ఫుల్ ఎలక్ట్రానిక్ బీట్స్, పంచ్ బాస్ లైన్స్, మెలోడీలతో అదిరిపోయింది. భాస్కరభట్ల సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉదిత్ నారాయణ్ చాలా కాలం తర్వాత మెగాస్టార్ సినిమా కోసం పాడటం



విశేషం. శ్వేతా మోహన్ వోకల్స్ మరింత బ్యూటీని యాడ్ చేసింది చిరంజీవి చార్మింగ్, స్టైలిష్ సూట్‌లో కనిపిస్తూ తన ట్రేడ్‌మార్క్ మెగా గ్రేస్‌ను స్టైలిష్ డ్యాన్స్ మూవ్స్‌తో అదరగొట్టారు. విజయ్ పొలాకి అందించిన కొరియోగ్రఫీ ఫ్యాన్స్‌కు విజువల్ ట్రీట్‌లా మారింది. చిరు, నయనతార కెమిస్ట్రీ మ్యాజికల్‌గా ఉంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ సినిమా రిలీజ్ కానుంది.

# అంతకు మించి హిట్ ఖాయం



హీరో కిరణ్ అబ్బవరం నటించిన కొత్త సినిమా 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రాజేశ్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మించారు. జైన్స్ నాని దర్శకత్వం వహించారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాతల్లో ఒకరైన రాజేశ్ దండ మాట్లాడుతూ,'దర్శకుడు జైన్స్ నాని చెప్పిన కథ హీరో కిరణ్‌కి, నాకూ నచ్చింది. కథానుసారం కేరళ బ్యాక్ డ్రాప్ పెట్టాం. అక్కడ చేయడం వల్ల సినిమాకు కొత్త లుక్ వచ్చింది. విజువల్‌గా బ్యూటీ యాడ్ అయ్యింది. హీరోయిన్ కేరళ అమ్మాయి. అక్కడ కాలేజ్‌లో చేసిన సీన్స్, ఓనమ్ సాంగ్ విజువల్‌గా కలర్‌ఫుల్‌గా వచ్చాయి. మా సంస్థకు ప్రధాన బలం ఫ్యామిలీ ఆడియెన్స్. మా సంస్థలో వచ్చిన గత చిత్రాలన్నింటినీ ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరించారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు కూడా ఫ్యామిలీ ఆడియెన్స్ ఎక్కడా ఇబ్బంది పడరు. మా సంస్థతో అల్లరి నరేష్‌కి, సందీప్ కిషన్‌కి ఎలాంటి మంచి అనుబంధం ఉందో కిరణ్‌తో కూడా అలాంటి రిలేషన్ ఏర్పడింది.

గతేడాది దీపావళికి కిరణ్‌కి 'క' సినిమాతో హిట్ దక్కింది. అంతకు మించిన విజయాన్ని మా సినిమా అందిస్తుందని ఆశిస్తున్నాం. చేతన్ భరద్వాజ్ ది బెస్ట్ మ్యూజిక్ ఇచ్చారు. ఆయన ఇచ్చిన బీజీఎం థియేటర్స్‌లో బ్లాస్ట్ అవుతుంది. ఇందులో మా పాప కూడా ఓ రోల్ చేసింది. శివ బొమ్మకు నా స్నేహితుడు. ఈ చిత్రంతో నాతో పాటు ప్రొడక్షన్‌లో భాగమయ్యారు. నా ఫేవరేట్ హీరో బాలకృష్ణతో సినిమా చేయాలనేది నా కోరిక. 'సామజవరగమన 2'ని అదే టీమ్‌తో చేస్తాం. ప్రస్తుతం హీరోయిన్ సంయుక్తతో ఫీమేల్ ఓరియెంటెడ్ మూవీ జరుగుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్‌తో కలిసి అల్లరి నరేష్‌తో ఓ సినిమా నిర్మిస్తున్నాం' అని తెలిపారు. 'ఈ కథను ఎంతో మెచ్యూర్డ్‌గా తెరకెక్కించారు మా డైరెక్టర్ నాని. ప్రొడ్యూసర్ రాజేశ్‌తో కలిసి కంఫర్ట్‌గా ఈ మూవీకి ప్రొడక్షన్ చేశాం. హీరో కిరణ్‌ని ఇందులో కొత్తగా చూస్తారు. ఇదొక మంచి ఎంటర్‌టైనర్. అన్ని వర్గాల ప్రేక్షకులనూ అలరిస్తుంది' అని ప్రొడ్యూసర్ శివ బొమ్మకు చెప్పారు.



# 2-0తో క్లీన్‌గా కొట్టారు

**- గంటలోనే ముగిసిన లాంఛనం - విండీస్‌పై టెస్టు సిరీస్ కైవసం - రెండో టెస్టులో భారత్ ఘన విజయం**




**శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ తొలి టెస్టు సిరీస్ విజయం అందుకుంది. న్యూఢిల్లీ టెస్టులో 7 వికెట్ల తేడాతో గెలుపొందిన భారత్.. రెండు మ్యాచుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను 2-2తో సమం చేసిన గిల్‌సేన.. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతుంది. ఐదో రోజు ఉదయం సెషన్లో గంటలోనే 58 పరుగులు పిండుకున్న భారత్ తొలి సెషన్లోనే లాంఛనం ముగించింది.**

**న్యూఢిల్లీ:** స్వదేశంలో టెస్టు సిరీస్‌ను టీమ్ ఇండియా తనదైన శైలిలో ముగించింది. ఐదో రోజు వరకు సాగిన రెండో టెస్టులో 7 వికెట్ల తేడాతో గెలుపొందిన భారత్ టెస్టు సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. అహ్మదాబాద్ టెస్టులో రెండున్నర రోజుల్లోనే శుభ్‌మన్‌సేనకు తలొంచిన కరీబియన్లు.. ఢిల్లీ టెస్టులో గేర్ మార్చారు. పడుతూ లేస్తూ.. ఆతిథ్య జట్టు విజయం కోసం ఐదు రోజులు ఆగేలా చేయగలిగింది. 121 పరుగుల లక్ష్యాన్ని భారత్ 35.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ కెఎల్ రాహుల్ (58 నాటౌట్, 108 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీతో కదం తొక్కగా.. సాయి సుదర్శన్ (39, 76 బంతుల్లో 5 ఫోర్లు) రాణించాడు. ఎనిమిది వికెట్లతో మాయాజాలం చేసిన కుల్‌దీప్ యాదవ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. రెండు టెస్టుల్లో కలిపి ఎనిమిది వికెట్లు సహా ఓ సెంచరీ బాదిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.

**గంటలోనే ముగించారు**

ఓవర్‌నైట్ స్కోరు 63/1తో ఐదో రోజు ఛేదనకు వచ్చిన భారత్.. మరో 10.2 ఓవర్లలోనే లాంఛనం ముగించారు. సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (00) అవుటైనా.. ధ్రువ్ జురెల్ (0 నాటౌట్) తోడుగా ఓపెనర్ కెఎల్ రాహుల్ విజయాన్ని అందించాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 104 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన కెఎల్ రాహుల్.. ఆడుతూ పాడుతూ భారత్‌ను గెలుపు తీరాలకు చేర్చాడు. కరీబియన్ స్పిన్నర్ రోస్టన్ ఛేజ్ రెండు వికెట్లు పడగొట్టి పర్యాటక జట్టుకు ఊరట కలిగించాడు. సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ ఇద్దరూ ఛేజ్ మాయలో పడ్డారు. తొలి టెస్టులో రెండున్నర రోజుల్లోనే చేతులెత్తేసిన వెస్టిండీస్.. రెండో టెస్టులో ఐదు రోజులు పోరాడింది. తొలి ఇన్నింగ్స్‌లో తడబడినా.. రెండో ఇన్నింగ్స్‌లో కాంప్‌బెల్, హౌప్ శతకాలతో భారత్‌ను మరోసారి బ్యాటింగ్‌కు పిలిచింది. ఎంతో వేగంగా పొరపాట్లను దిద్దుకునే ప్రయత్నం చేసిన వెస్టిండీస్.. ఢిల్లీ టెస్టులో ఓడినా గొప్ప పోరాట స్ఫూర్తి కనబరిచి విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది.

**స్కోరు వివరాలు:**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 518/10
**వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** 248/10
**వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్):** 390/10
**భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) ఫిలిప్ (బి) వారికన్ 8, రాహుల్ నాటౌట్ 58, సాయి సుదర్శన్ (సి) హౌప్ (బి) ఛేజ్ 39, శుభ్‌మన్ గిల్ (సి) గ్రీవ్స్ (బి) ఛేజ్ 13, ధ్రువ్ జురెల్ నాటౌట్ 6,
**మొత్తం:** (35.2 ఓవర్లలో 3 వికెట్లకు) 124.
**వికెట్ల పతనం:** 1-9, 2-88, 3-108.
**బౌలింగ్:** జేడెన్ సీయల్స్ 3-0-14-0, జోమెల్ వారికన్ 15.2-4-39-1, ఖారీ పియర్రీ 8-035-0, రోస్టన్ ఛేజ్ 9-2-36-2.

# ముంబయి మీటియర్స్ జోరు



**హైదరాబాద్:** ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాల్గో సీజన్‌లో ముంబయి మీటియర్స్ అజేయ జోరు కొనసాగుతుంది. మంగళవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై ముంబయి మీటియర్స్ 3-2తో విజయం సాధించింది. 15-7, 7-15, 13-15, 15-8, 15-11తో ముంబయి మీటియర్స్ సీజన్లో నాల్గో విజయం ఖాతాలో వేసుకుంది. తొలి నాలుగు సెట్లలో కొచ్చి బ్లూ స్పైకర్స్, ముంబయి మీటియర్స్‌లు సమవుజ్జీలుగా నిలిచాయి. నిర్ణయాత్మక ఐదో సెట్లో ఆధిపత్యం చూపించిన ముంబయి మీటియర్స్ సెమీఫైనల్ బెర్త్‌కు చేరువైంది. పీవీఎల్4లో కొచ్చి బ్లూ స్పైకర్స్‌కు ఇది హ్యాట్రిక్ పరాజయం కాగా.. ఓవరాల్‌గా ఐదు మ్యాచుల్లో నాల్గో ఓటమి. కార్తీక్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్‌పై 15-11, 15-8, 15- 6తో గోవా గార్డియన్స్ గెలుపొందింది.

# జూనియర్ ప్రపంచకప్‌కు ప్రణవ్



**హైదరాబాద్:** తెలంగాణ యువ ఐస్‌స్కేటర్ ప్రణవ్ మాధవ్ సురపనేని (16) జూనియర్ ప్రపంచకప్‌కు అర్హత సాధించాడు. షార్ట్ ట్రాక్ ఐస్ స్కేటింగ్‌లో సత్తా చాటిన ప్రణవ్ మాధవ్ ఈ ఏడాది ఆఖర్లో కజకిస్తాన్‌లోని అస్తానా వేదికగా జరుగనున్న జూనియర్ వరల్డ్‌కప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. జూనియర్ వరల్డ్‌కప్‌కు భారత్ నుంచి ముగ్గురు అర్హత సాధించగా.. తెలంగాణ నుంచి ఈ ఘనత దక్కించుకున్న తొలి ఐస్ స్కేటర్ ప్రణవ్ మాధవ్ కావటం విశేషం. 'సమ్మర్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించటం నా స్వప్నం. జూనియర్ వరల్డ్‌కప్‌లో ఆడటం ఈ ప్రయాణంలో తొలి అడుగు మాత్రమే. ప్రపంచకప్‌లో పతకం సాధిస్తాననే నమ్మకం ఉందని' ప్రణవ్ మాధవ్ అన్నాడు.


Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం

◆నేడు ఆయన జయంతి

**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఈయన పూర్తి పేరు.. డాక్టర్ అవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలామ్. ఈయన 1931, అక్టోబర్ 15వ తేదీన తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు అషియమ్మ జైనులాబ్దీన్, జైనులాబ్దీన్ మరకయార్. ఓ మధ్యతరగతి ముస్లిం కుటుంబంలో పుట్టిన ఆయన 1958లో మద్రాస్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ ఎం) నుంచి ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పుచ్చుకున్నారు. పట్టభద్రుడైన తర్వాత ఆయన భారతదేశపు రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఒ)లో ఒక విఫలమైన హోవర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు మీద పనిచేయడానికి చేరారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరారు. అక్కడ ఆయన ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారతదేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎల్ వి-ఎఐఐ)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు “మిస్సైల్ మాన్” అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-ఎఎ అణుపరీక్షలు విజయవంతంగా పూర్తి చేయడంజరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్రరాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఈయనకు భారతదేశ అత్యున్నత పురస్కారాలైన పద్మ భూషణ్ (1981), పద్మ విభూషణ్ (1990), భారతరత్న (1997)లు వరించాయి. అలాగే, దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో కనీసం 30వరకు యూనివర్శిటీలు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగుపెట్టారు. ఈయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాంపై వామపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా 87-ఏళ్ళ లక్ష్మీ సెహగల్ పోటీ చేశారు. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. ఖచ్చితమైన వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తారు. “ప్రజలు.. తమ భార్యాపిల్లలకు తమ పిల్లల పిల్లలకూ ఆస్తులు సంపాదించి పెట్టడం కోసమే అవినీతిపరులౌతారు” అంటూ ఆయన బ్రహ్మచర్యాన్ని స్వీకరించారు. ఇస్లాం ప్రకారమైతే ప్రతి ముస్లిమూ పెళ్ళి చేసుకోవాలి. కానీ, కలాం ఖురాన్‌తో పాటు, భగవద్గీతను కూడా చదువుతారు. మతఘర్షణలను నిరసించే శాంతికాముకుడిగా పేరుగడించారు. ఈయన



వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. రాష్ట్రపతిగా కూడా సేవలందించిన మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం జూలై 27, 2015 సోమవారం సాయంత్రం హఠాన్మరణానికి గురయ్యారు. షిల్లాంగ్‌లోని ఐఐఎంలో సోమవారం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం హఠాత్తుగా ప్రసంగం మధ్యలో కుప్పకూలిపోయారు. గుండెపోటుతో కుప్పకూలిన అబ్దుల్ కలాంను స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో ఉంచి చికిత్స అందించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత 45 నిమిషాల వ్యవధిలోనే కలాం కన్నుమూశారు. అప్పటికి ఆయన వయస్సు 84 సంవత్సరాలు.

# నాయుడుపేటలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు 786 రఫీ కృషి



## రూ.5లక్షలతో విగ్రహం ఏర్పాటుకు పనులు ప్రారంభం

**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** నాయుడుపేటలోని సియస్ తేజ సెంటర్ వద్ద గల మునిసిపల్ స్థలములో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ కృషి చేస్తున్నారు. గురువారం సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ చేతుల మీదుగా భూమి పూజ నిర్వహిస్తున్నట్లు నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ ఉదయం దినపత్రిక ప్రతినిధితో ఒక ప్రకటనలో తెలిపారు. నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ. కోరిక మేరకు సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలల విజయశ్రీ ఆదేశాలతో సినీ నటుడు తెలుగు ప్రజల గుండెల్లో శిరస్థాయిగా చెరగని ముద్ర ఏసుకొని తెలుగు ప్రజల కోసం ప్రతి పేదవాడికి కూడు గుడ్డ అవసరమనే నినాదంతో తెలుగు రాష్ట్రములో తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజా నేతగా ప్రజలకు సేవలు చేసిన మహా నేత విగ్రహం నాయుడుపేటలో ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమి పూజ చేయుటకు స్థల పరిశీలన చేసి ఏర్పాట్లు చేస్తున్న నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు కృతజ్ఞతలు తెలిపారు. నాయుడుపేట పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని టిడిపి నేతల ఆశయం నెరవేర్చబోతున్నందుకు సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకి. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలకు మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీకి తెలుగు తమ్ముళ్లు రుణపడి ఉంటారని పరువు టిడిపి నేతలు అభిప్రాయపడుతున్నారు.

# సింగరేణికి ఇంటర్నేషనల్ బ్రాండ్

**హైదరాబాద్, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** అరుదైన లోహాల అన్వేషణ కోసం సింగరేణి సంస్థ హైదరాబాద్‌లో ఒక అంతర్జాతీయ కార్యాలయం ఏర్పాటు చేయనుంది. దీని కోసం ఫ్యూచర్ సిటీలో పది ఎకరాల స్థలాన్ని కేటాయించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ప్రకటించారు. విదేశీ నైపుణ్యం కలిగిన సంస్థలతో ఒప్పందాలు చేసుకునేందుకు ఈ కార్యాలయం కేంద్రంగా నిలుస్తుంది. బొగ్గు ఉత్పత్తితో పాటు ఖనిజాల వెలికితీత రంగంలోకి అడుగు పెడుతున్న సింగరేణి.. త్వరలోనే భవన నిర్మాణ పనులను మొదలుపెట్టనుంది.తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అంతర్జాతీయ స్థాయిలో తన కార్యకలాపాలను విస్తరించడానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా అరుదైన లోహాల అన్వేషణ , వెలికితీతకు అనుమతులు పొందిన నేపథ్యంలో.. విదేశీ సంస్థలతో సహకారం కోసం హైదరాబాద్‌లో ఒక అంతర్జాతీయ కార్యాలయాన్ని స్థాపించాలని ప్రణాళికలు రచిస్తోందిఫ్యూచర్ సిటీలో సింగరేణి కార్యాలయం ఏర్పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ‘ఫ్యూచర్ సిటీ’ ప్రాజెక్ట్‌లో పది ఎకరాల స్థలాన్ని సింగరేణికి కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. సీఎం ప్రకటన సింగరేణి అంతర్జాతీయ లక్ష్యాలకు మద్దతుగా నిలిచింది.హైదరాబాద్‌కు సమీపంలో, ఏడు మండలాల పరిధిలో ఉన్న 56 గ్రామాలను కలుపుతూ 30 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీని ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అంతర్జాతీయ సంస్థలను పరిశ్రమలు నెలకొల్పేందుకు ఆహ్వానిస్తున్న ఈ ప్రాంతంలో సింగరేణికి పది ఎకరాలు కేటాయించడానికి నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన హక్కు పత్రాలను అప్పగించేందుకు చర్యలు చేపట్టనున్నారు.స్థలం అందుబాటులోకి వచ్చిన వెంటనే.. సింగరేణి తన అంతర్జాతీయ స్థాయి కార్యాలయ నిర్మాణానికి సన్నద్ధమవుతోంది. ఈ భవనానికి సంబంధించిన నమూనాల కోసం ఇప్పటికే నిపుణులతో సంప్రదింపులు జరుపుతోంది. సింగరేణి సీఎండీ ఎన్. బలరాం మాట్లాడుతూ.. ‘భవిష్యత్ అవసరాలకనుగుణంగా’ ఈ ఆఫీస్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. దశాబ్దాలుగా బొగ్గు ఉత్పత్తికి పర్యాయపదంగా ఉన్న సింగరేణి, ఇప్పుడు అరుదైన లోహాలు వంటి కీలకమైన ఖనిజాల అన్వేషణ దిశగా అడుగులు వేస్తోంది.లిథియం, టైటానియం వంటి అరుదైన ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న



డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. ఈ లోహాలను గుర్తించడం, వెలికితీయడం కోసం వివిధ దేశాలలోని నైపుణ్యం కలిగిన సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని సంకల్పించింది. హైదరాబాద్‌లో అంతర్జాతీయ కార్యాలయం ఏర్పాటు చేయడం ఈ భాగస్వామ్యాలకు ఒక కేంద్రంగా పనిచేయనుంది.ఈ విస్తరణ సింగరేణికి మాత్రమే కాకుండా... తెలంగాణ రాష్ట్రానికి కూడా అపారమైన ఆర్థిక, సాంకేతిక ప్రయోజనాలను చేకూర్చనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఖనిజాల వెలికితీత రంగంలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఈ కొత్త కార్యాలయం ద్వారా విదేశీ పెట్టుబడులు, నూతన సాంకేతికత రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. ఈ ముందడుగుతో సింగరేణి ఒక రాష్ట్ర సంస్థ స్థాయి నుంచి అంతర్జాతీయంగా విస్తరించే సంస్థగా మారుతోంది.

## సజ్జలను కలిసిన సత్యనారాయణరెడ్డి





పెళ్లకూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 14: తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలానికి చెందిన వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువా కప్పి సన్మానించారు. తదనంతరం మాజీ ముఖ్యమంత్రి, ప్రజాహృదయ నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మకోలేరు..వాడుకోలేరు

◆22 ఏ కిందకు ఎకరాల భూమి



**ఏలూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 14:** కొరందరికీ ఎకరాల కొద్దీ భూమి ఉంది. కానీ ఏదైనా అత్యవసం అయితేనో.. ఆడబిడ్డకో ఇవ్వలేరు.. వారసులకు పంచలేరు. చుట్టూ నీరున్నా.. తాగడానికి పనికి రాదు అన్న చందంగా ఉంది వారి పరిస్థితి. ఎకరాల కొద్దీ భూములున్నా అవన్నీ 22ఎ(నిషేధిత ఆస్తుల) జాబితాలో ఉండటంతో.. ఇటు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేక భూ యజమానులు నరకం చూస్తున్నారు. అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధుల భూములు చేతులు మారినా.. గత ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌లో పెట్టి అమ్మకాలు ఆపేసింది. సుమారు 15 వేల ఎకరాల భూములు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి.భూమి ఉంటే మనిషికి కొండంత భరోసా. ఎంత పెద్ద కష్టం వచ్చినా సరే.. తీర్చుకోవచ్చు అనే ధీమా ఉంటంది. చిన్న చిన్న అక్కర్లకు అయితే భూమిని తాకట్టు పెట్టి రుణం పొందవచ్చు. పెద్ద సమస్య వస్తే.. భూమిని అమ్ముకుని కష్టం నుంచి బయపడవచ్చు. ఆడబిడ్డ పెళ్లికి కట్నంగా కూడా ఇవ్వొచ్చు. భూమి ఉంటే మనిషికి తల్లి దగ్గర ఉన్నంత భరోసా ఉంటుంది. కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే రైతులది విచిత్రమైన పరిస్థితి. వారందరి పేరు మీద వేల ఎకరాల భూములున్నా.. వారికి అక్కరకు రాకుండా పోతున్నాయి. పోని వారసులకు పంచుదామా అంటే దానికి వీలు లేకుండా ఉంది. అసలేంటి సమస్య అంటే..పశ్చిమ గోదావరి జిల్లాలోని చాలా మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. వారి పేరు మీద ఎకరాల కొద్దీ భూములున్నా.. ఇటు ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేని దుస్థితిలో ఉన్నారు. కారణం వారి భూములు 22ఎ జాబితాలో ఉండటం. అదేలా జరిగింది అంటే.. ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్స్ ఈ జాబితాలోకి వస్తాయి. ఈ భూములను అమ్ముకోలేరు.. వారసులకు పంచలేరు.మండలంలో అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులకు కేటాయించిన భూములను కొందరు అమ్ముకున్నారు. ఈ భూములు పలుమార్లు చేతులు మారాయి. అయితే గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టింది. వాటి అమ్మకాలు, కొనుగోళ్లను నిలిపివేసింది. ఈ భూములకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, అడంగల్ పత్రాలు, పాస్‌పుస్తకాలు వంటివి ఉన్నా సరే.. పాలకుల నిర్ణయాల వల్ల సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యను పరిష్కరిస్తుందని వారు ఆశించారు. కానీ రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఈక్రమంలో తాజాగా పెదవేగి మండలానికి చెందిన కొందరు.. కోర్టు అనుమతితో భూములను రిజిస్టర్ చేయించుకున్నారు. అయితే ఈ సమస్య ఎదుర్కొంటున్న అందరూ ఇలా కోర్టుకు వెళ్లడం సాధ్యం కాదు. కనుక ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.పెదవేగి మండలంలోనే అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటుంది. ఈ భూముల సమస్యలను పరిష్కరించాలని బాధితులు పీజీఆర్ఎస్‌లోనూ విన్నవించుకున్నారు. అయినా ప్రయోజనం లేదని తెలుస్తోంది. ఈ భూములపై ప్రతి వారం కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. సరైన పత్రాలు ఉన్న భూములను ఈ జాబితా నుంచి తొలగిస్తామని వెల్లడించారు. వాటి క్రయ, విక్రయాలకు అవకాశం కల్పిస్తున్నామని.. ఈ మేరకు తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చామని వారు పేర్కొన్నారు

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854